- aruhi group
www.mahaaprabha.com

# నమస్తే మహాప్రభ

ప్రజల కోసం.., ప్రజలతో...మహాప్రభ

తెలుగు దినపత్రిక

మంగళవారం
14-07-2026

సంపుటి : 01 సంచిక : 112 పేజీలు : 08 వెల : ₹5/-

తెలంగాణ , ఆంధ్రప్రదేశ్.



Mr. NAKKA RAJU
Chairman of Mahaaprabha

Published From RANGAREDDY TELANGANA.RNI NO : TGTEL/26/A0738 VOLUME 01 ISSUE 112 NAMASTEY MAHAAPRABHA

## ఇరాన్ రివెంజ్ లిస్టులో
# 13 మంది ప్రపంచ నేతలు

- ప్రతీకారం తప్పదు' అంటూ మోజ్తాబా ఖమేనీ తీవ్ర హెచ్చరిక
- రివెంజ్ లిస్ట్‌పై ప్రపంచవ్యాప్తంగా తీవ్ర చర్చ
- ట్రంప్ భద్రతపై అమెరికా అప్రమత్తం
- హర్ముజ్ జలసంధి ఉద్రిక్తతలతో పెరిగిన ఆందోళన
- పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్త పరిస్థితులు
- ఇరాన్--అమెరికా తాజా పరిణామాలపై గల్ఫ్ దేశాల స్పందన
- ప్రతీకార వ్యాఖ్యలతో అంతర్జాతీయ వర్గాల్లో కలకలం

**అమెరికా అధ్యక్షుడు ట్రంప్, ఇజ్రాయెల్ అధినేత నెతన్యాహు తో సహా పలువురి పేర్లు**



న్యూఢిల్లీ: 13 జూలై మహాప్రభ
మాజీ సుప్రీం లీడర్ దివంగత ఆయతుల్లా అలీ ఖమేనీ హత్య తర్వాత అమెరికా, ఇజ్రాయెల్ నేతలపై ఇరాన్ ప్రతీకారేచ్ఛతో రగిలిపోతోంది. ఈ నేపథ్యంలోనే ఆయన కుమారుడు మోజ్తాబా ఖమేనీ ఈనెల మొదటి బహిరంగ ప్రసంగం చేస్తూ, 13 మంది ప్రపంచ నేతలతో కూడిన ఒక 'రివెంజ్' లిస్టును ప్రకటించారు. ఇరాన్ జాతీయ దినపత్రిక 'హమ్ షాహ్రీ' శనివారం రాత్రి ఈ జాబితాను ఆన్‌లైన్‌లో -మిగతా 3లో



## హెర్ముజ్‌లో నౌకలపై 20% సుంకం..

- అమెరికా అధ్యక్షుడి ప్రకటన
- జలసంధి సంరక్షకురాలిగా అమెరికా వ్యవహరిస్తుంది
- ఇరాన్‌పై మళ్లీ దిగ్బంధనం
- అమెరికా జోక్యాన్ని అనుమతించబోమన్న ఇరాన్

వాషింగ్టన్,
హెర్ముజ్ జలసంధిని అమెరికా స్వాధీనం చేసుకుంటుందని ప్రకటించిన కొన్ని గంటలకే ఇరాన్‌పై దిగ్బంధనాన్ని తిరిగి విధిస్తున్నట్లు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. హెర్ముజ్ జలసంధి భద్రత బాధ్యతను అమెరికా చూసుకుంటుందని, దాని గుండా వెళ్లే సరుకుపై 20 శాతం రుసుమును అమెరికా వసూలు చేస్తుందని కూడా ఆయన ప్రకటించారు. ఇరాన్ ఉన్నా లేకపోయినా హెర్ముజ్ జలసంధి తెరిచే ఉంది, తెరిచే ఉంటుంది. మేము ఇరాన్ దిగ్బంధనాన్ని పునరుద్ధరిస్తున్నాము. ఈ దిగ్బంధనం కేవలం ఇరాన్ నౌకలు లేదా వినియోగదారులను మాత్రమే అడ్డుకుంటుంది. ఇతర దేశాలన్నీ ఈ జలసంధిని న్యాయబద్ధంగా, స్వేచ్ఛగా ఉపయోగించుకోవచ్చు అని ట్రూత్ సోషల్‌లో ట్రంప్ పేర్కొన్నారు. ఇకపై హెర్ముజ్ సంరక్షకురాలిగా అమెరికా వ్యవహరిస్తుందని ఆయన తెలిపారు. ప్రపంచంలోని అత్యంత ఉద్రిక్తతలతో కూడిన ఈ ప్రాంతానికి భద్రత కల్పించే బాధ్యతను నిర్వహించడానికి అయ్యే ఖర్చులన్నింటికీ పరిహారంగా ఈ మార్గం గుండా రవాణా అయ్యే సరుకుపై 20% రుసుమును అమెరికా వసూలు చేస్తుందని ఆయన తెలిపారు. ఈ ప్రక్రియ తక్షణమే ప్రారంభమవుతున్నట్లు కూడా ఆయన పేర్కొన్నారు.
ఇరాన్ తిరస్కరణ -మిగతా 3 లో



## తెలంగాణ టెట్ ఫలితాలు విడుదల

- రాష్ట్రవ్యాప్తంగా 1,53,752 మంది అభ్యర్థుల దరఖాస్తు
- 1,15,028 మంది పరీక్షకు హాజరు
- 50,544 మంది అర్హత సాధించిన అభ్యర్థులు
- శాతం 43.94 ఉత్తీర్ణత
- ఫలితాలు విడుదల చేసిన పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్

తెలంగాణ బ్యూరో ప్రతినిధి 13 జూలై మహాప్రభ : తెలంగాణ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ 2026 ఫలితాలను సోమవారం మధ్యాహ్నం పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ విడుదల చేశారు. అభ్యర్థులు తమ హాల్ టికెట్ నంబర్ ఆధారంగా ఫలితాలను అధికారిక వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని తెలిపారు. ఈ ఫలితాల్లో అభ్యర్థుల మార్కులు, అర్హత తదితర వివరాలు అందుబాటులో ఉంటాయని అధికారులు వెల్లడించారు. జూన్ 16వ తేదీ నుంచి 22వ తేదీ మధ్య మొత్తం పది సెషన్లలో ఈ పరీక్షలు జరిగాయి. ఏడాది డీజీ టెట్ కోసం రాష్ట్రవ్యాప్తంగా 1,53,752 మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా, వారిలో 1,15,028 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 23,623 మంది ఇన్ సర్వీస్ టీచర్లు, 91,405 మంది ఇతర అభ్యర్థులు ఉన్నారు. మొత్తం పరీక్ష రాసిన వారిలో 50,544 -మిగతా 3లో

## రాష్ట్ర ప్రయోజనాలే
# ముఖ్యం

**పార్టీలకు అతీతంగా పార్లమెంటులో తెలంగాణ వాణి వినిపించండి**

- కేంద్ర అనుమతుల కోసం ప్రధాని, కేంద్ర మంత్రులను కలిసి విజ్ఞప్తులు చేయండి
- కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డిపై నిపుణుల కమిటీకి సానుకూల స్పందన
- ఆర్ఆర్ఆర్, మెట్రో, ఐఐఎం సహా పెండింగ్ ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి
- గోదావరి జలాలు, తుంగభద్ర పూడిక అంశాలను కేంద్రం దృష్టికి తీసుకెళ్లాలని పిలుపు
- తెలంగాణ భవన్‌లో ఎంపీల సమన్వయానికి ఐఏఎస్ అధికారిని నియమించిన ప్రభుత్వం
- రాష్ట్ర సమస్యల పరిష్కారానికి అన్ని పార్టీల ఎంపీలు కలిసికట్టుగా పనిచేయాలని పిలుపు
- ఎంపీల సమావేశంలో సీఎం రేవంత్ రెడ్డి



హైదరాబాద్13 జూలై మహాప్రభ
తెలంగాణ రాష్ట్ర ప్రయోజనాలే లక్ష్యంగా పార్లమెంటులో గళాన్ని వినిపించాలని సీఎం ఏ రేవంత్‌రెడ్డి అన్నారు. దానికోసం రాజకీయాలకు అతీతంగా పనిచేసేందుకు సిద్ధంగా ఉండాలని చెప్పారు. పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో సోమవారంనాడాయన హైదరాబాద్ ప్రజాభవన్‌లో ఎంపీలతో భేటీ అయ్యారు. దీనికి కాంగ్రెస్ ఎంపీలతోపాటు బీజేపీ ఎంపీలు ఈటల రాజేందర్, కొండా విశ్వేశ్వరరెడ్డి కూడా హాజరయ్యారు. అధికారపార్టీ నిర్వహించే ఎంపీల సమావేశంలో ప్రతిపక్ష ఎంపీలు కూడా పాల్గొనడం ఇదే తొలిసారి. ఈ -మిగతా 3లో



## షాబాద్ నరహంతకుడు మృతి

- ఓ వెంచర్‌లో అతడి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు
- డయల్ 100కు సమాచారం పోలీసుల ఎంట్రీ
- మృతుడిని రాజ్ కుమార్‌గా నిర్ధారించిన పోలీసులు
- మృతదేహం పక్కన పాయిజన్ బాటిల్ గుర్తింపు
- నిందితుడు ఆత్మహత్య చేసుకున్నట్లు భావిస్తున్న పోలీసులు

హైదరాబాద్ 13 జూలై మహాప్రభ
తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన షాబాద్ ఆరు హత్యల కేసులో నరహంతకుడు రాజ్ కుమార్ (29) మృతిచెందాడు. రంగారెడ్డి జిల్లా కొత్తూరు మండలం పెంజరలోని ఓ వెంచర్‌లో అతడి మృతదేహాన్ని స్థానికులు గుర్తించారు. డయల్ 100కు సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడికి చేరుకుని పరిశీలించారు. మృతుడిని రాజ్ కుమార్‌గా నిర్ధారించారు. మృతదేహం -మిగతా 3లో

## పిల్లలకు సోషల్ మీడియా బ్యాన్

- కీలక ప్రతిపాదన చేసిన యూరోపియన్ యూనియన్
- వయో పరిమితిని తీసుకొస్తున్నట్లు మీడియాకు వెల్లడి




3లో




## అట్టడుగున భారత్

- పర్యావరణ పనితీరు సూచీలో మళ్లీ నిరాశే
- ప్రపంచవ్యాప్తంగా 177 దేశాల్లో 176వ ర్యాంకు
- దక్షిణాసియాలోనూ చివరి స్థానమే : ఈపీఐ నివేదిక
- గాలి కాలుష్యం, బొగ్గుపై ఆధారపడటం, జీవవైవిధ్య బలహీనతలే ప్రధాన కారణాలు
- పర్యావరణ నిపుణులు

న్యూఢిల్లీ 13 జూలై మహాప్రభ
ప్రపంచ దేశాల పర్యావరణ పనితీరును అంచనా వేసే ఎన్విరాన్‌మెంట్ పర్ఫామెన్స్ ఇండెక్స్ (ఈపీఐ)-2026లో భారత్ మరోసారి అట్టడుగు స్థానంలో నిలిచింది. ప్రపంచవ్యాప్తంగా మొత్తం 177 దేశాల్లో భారత్ 176వ ర్యాంకులో ఉంది. అంటే.. చివరి నుంచి రెండో స్థానం. భారత్‌కు ఈపీఐ స్కోరు 100లో 22.46 పాయింట్లు మాత్రమే లభించాయి. 74.79 పాయింట్లతో ఎస్టోనియా అగ్రస్థానంలో ఉంది. ఇక దక్షిణాసియా -మిగతా 3లో

## తెలంగాణ సంస్కృతికి ప్రతీక
# బోనాల ఉత్సవాలు



**ఆషాఢ బోనాల జాతరకు ప్రభుత్వం సర్వం సిద్ధం**

- ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు అన్ని శాఖల సమన్వయం
- ఈ నెల 16 నుండి ఆగస్టు 13 వరకు గోల్కొండ నుంచి లాల్ దర్వాజా వరకు బోనాల జాతరకు ప్రత్యేక ఏర్పాట్లు
- ఉత్సవాల నిమిత్తం 3427 దేవాలయాలకు రూ.15 కోట్ల నిధులు విడుదల
- భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలి : ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్

హైదరాబాద్ 13 జూలై మహాప్రభ
తెలంగాణ రాష్ట్ర ఆధ్యాత్మిక, సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచే ఆషాఢ మాస బోనాల జాతరను అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని శాఖలతో సమన్వయం చేస్తూ విస్తృత ఏర్పాట్లు చేపట్టిందని హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ఒక ప్రకటన ద్వారా తెలిపారు. జూలై 16 నుండి ఆగస్టు 13 వరకు హైదరాబాద్, సికింద్రాబాద్ నగరాల్లో బోనాల ఉత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో లక్షలాది మంది భక్తులు ఆలయాలకు తరలివచ్చే అవకాశాన్ని దృష్టిలో ఉంచుకుని అన్ని శాఖలు అప్రమత్తంగా పనిచేయాలని మంత్రి అధికారులను ఆదేశించారు. -మిగతా 3లో

## సీఎంది 'షాబాద్ కిల్లర్'
# మైండ్‌సెట్

- రాజకీయాలు పక్కనబెట్టండి.. 'కన్నెపల్లి' ఆన్ చేయండి
- డెడ్ స్టోరేజీలో ప్రాజెక్టులు
- తాగునీటికీ గడ్డు పరిస్థితులు
- ఉత్తర తెలంగాణ ఎడారిగా మారే ప్రమాదం
- కరీంనగర్ ఎల్ఎమ్‌డిని సందర్శించిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్




కరీంనగర్ 13 జూలై మహాప్రభ
'మాపై కోపంతో సీఎం రేవంత్‌రెడ్డి నీళ్లు ఎత్తిపోయకుండా రైతులను వేధిస్తున్నారు. ఆయన వైఖరి 'షాబాద్ కిల్లర్' మైండ్ సెట్‌లా ఉంది.. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ నేరపూరిత వైఖరి వల్ల ఇప్పటికే ప్రాజెక్టులన్నీ డెడ్‌స్టోరేజీలోకి వెళ్లి తాగునీటికీ గడ్డు పరిస్థితులను తెచ్చిపెట్టాయి.. ఉత్తర తెలంగాణ ప్రాంతం ఎడారిగా మారే ప్రమాదం ఉంది..” అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారకరామారావు ఆందోళన వ్యక్తం చేశారు. కరీంనగర్, రాజన్నసిరిసిల్ల జిల్లాల పర్యటనలో భాగంగా -మిగతా 3లో

# ఉక్రెయిన్ ప్రధాని యులియా రాజీనామా



**కీవ్ 13 జూలై మహాప్రభ**
ఉక్రెయిన్ ప్రధాని యులియా స్విరిడెంకో రాజీనామా చేశారు. ఉక్రెయిన్ మంత్రిమండలిలో ఆ దేశాధ్యక్షుడు జెలెన్‌స్కీ భారీ మార్పులు చేశారు. దీంతో ఆమె తప్పుకున్నారు. అధ్యక్షుడు జెలెన్‌స్కీ తనకు కొత్త బాధ్యతలు అప్పగించినట్లు ఆమె చెప్పారు. గతంలో ఉక్రెయిన్ ఆర్థిక మంత్రిగా స్విరిడెంకో చేశారు. అయితే 2025 జూలైలో ఆమెకు ప్రధాని బాధ్యతలు అప్పగించారు. అమెరికా, ఉక్రెయిన్ మధ్య ఖనిజ ఒప్పందంలో కీలక పాత్ర పోషించినట్లు ఆమెపై గతంలో ఉక్రెయిన్ ప్రభుత్వం ప్రశంసలు కురిపించింది. సంక్లిష్ట సమయంలో ఉక్రెయిన్‌కు నాయకత్వం వహించడం గౌరవంగా భావిస్తున్నట్లు స్విరిడెంకో తన సోషల్ మీడియా పోస్టులో తెలిపారు. తన తదుపరి కార్యాచరణ గురించి జెలెన్‌స్కీతో చర్చించినట్లు ఆమె తెలిపారు. తన రాజకీయా వ్యూహాన్ని మార్చుతున్నానని, దీనిలో భాగంగా ప్రధాని రాజీనామా చేస్తున్నట్లు జెలెన్‌స్కీ తెలిపారు. ప్రస్తుతం రష్యా, ఉక్రెయిన్ మధ్య యుద్ధం జరుగుతున్న నేపథ్యంలో మార్షియల్ చట్టం ప్రకారం జెలెన్‌స్కీ బాధ్యతల నుంచి తప్పుకోలేదు. యుద్ధ సమయంలో ఎన్నికలు నిర్వహించరు కాబట్టి, ఆయన కేవలం తన క్యాబినెట్‌లో మార్పులు చేశారు. పరిపాలనలో కొత్త వారికి అవకాశం కల్పించారు.

# బంగ్లాదేశ్ లో ఎడతెరిపి లేని వర్షాలు..
## 51 మంది మృతి



**హైదరాబాద్ 13 జూలై మహాప్రభ**
బంగ్లాదేశ్‌లో రుతుపవనాల ప్రభావంతో కురుస్తున్న ఎడతెరిపి లేని భారీ వర్షాలు తీవ్ర విషాదాన్ని మిగిల్చాయి. గత కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆకస్మిక వరదలు, కొండచరియలు విరిగిపడిన ఘటనల్లో కనీసం 51 మంది ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు తెలిపారు. ముఖ్యంగా కాక్స్ బజార్, చిట్టగాంగ్ ప్రాంతాలు తీవ్రంగా ప్రభావితమయ్యాయి. అనేక గ్రామాలు నీటమునిగిపోగా, రహదారి, విద్యుత్, కమ్యూనికేషన్ వ్యవస్థలు దెబ్బతిన్నాయి. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు.

# నాగాలాండ్‌లో ఐఈడీ పేలుడు.. జవాన్ మృతి



**హైదరాబాద్ 13 జూలై మహాప్రభ**
ఈశాన్య భారతదేశంలో భద్రతా దళాలపై దాడులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. నాగాలాండ్‌లోని చుమౌకెడిమా పరిధిలో గల సుఖోయ్ ప్రాంతంలో అస్సాం రైఫిల్స్ కాన్వాయ్ సమీపంలో అనుమానిత పేలుడు పదార్థం పేలింది. ఈ ఘటనలో ఒక జవాన్ మృతి చెందగా, మరో నలుగురు తీవ్రంగా గాయపడ్డారు. వారం రోజుల వ్యవధిలోనే అస్సాం రైఫిల్స్ కాన్వాయ్ లక్ష్యంగా దాడి చేయడం ఇది రెండవసారి. భద్రతా దళాలు ఆ ప్రాంతాన్ని దిగ్బంధించి, అనుమానిత ఉగ్రవాదుల కోసం గాలింపు చర్యలు చేపట్టాయి.

# క్షణాల్లో గుండెజబ్బులను గుర్తించే ఏఐ స్కిన్ ప్యాచ్

**సైటెక్ 13 జూలై మహాప్రభ**
హార్ట్ ఎటాక్ వంటి అత్యవసర పరిస్థితుల్లో కొన్ని నిమిషాల ఆలస్యం కూడా ప్రాణాపాయానికి దారితీస్తుంది. ఈ సమస్యకు పరిష్కారంగా షికాగో యూనివర్సిటీ శాస్త్రవేత్తలు అత్యాధునిక ఏఐ స్కిన్ ప్యాచ్‌ను అభివృద్ధి చేశారు. ఈ ప్యాచ్ సెకనులోని వందోవంతు



సమయంలోనే గుండె పనితీరును విశ్లేషించి, గుండె సంబంధిత సమస్యలను 99 శాతం కచ్చితత్వంతో గుర్తించగలదని పరిశోధకులు తెలిపారు. ఈ స్కిన్ ప్యాచ్ మృదువైన పలుచని పొరలా ఉండి, శరీరానికి సులభంగా అతుక్కుపోతుంది. ఇందులో అమర్చిన ఆర్గానిక్ ఎలక్ట్రోకెమికల్ ట్రాన్సిస్టర్లు గుండె కొట్టుకునే తీరులో వచ్చే స్వల్ప మార్పులను కూడా వెంటనే గుర్తించి, కృత్రిమ మేధస్సు (ఏఐ) సాయంతో అదే క్షణంలో విశ్లేషిస్తాయి. ప్రమాద సూచనలు కనిపిస్తే వెంటనే వైద్యులకు హెచ్చరికలు పంపించే సామర్థ్యం దీనికి ఉంది. సాధారణంగా స్మార్ట్‌వాచ్‌లు గుండె స్పందన, నడక వంటి వివరాలను సేకరిస్తాయి. అయితే ఆ సమాచారాన్ని విశ్లేషించడానికి బయటి సర్వర్లపై ఆధారపడాల్సి ఉంటుంది. కానీ ఈ కొత్త ఎఐ స్కిన్ ప్యాచ్ మాత్రం డేటాను పరికరంలోనే అత్యంత వేగంగా విశ్లేషించడం వల్ల స్పందన సమయం గణనీయంగా తగ్గుతుంది. ప్రాణాంతకమైన వెంట్రిక్యులర్ ఫిబ్రిలేషన్ వంటి గుండె స్పందనలో అకస్మాత్తుగా ఏర్పడే ప్రమాదకర మార్పులను ముందుగానే గుర్తించి, సకాలంలో వైద్య సహాయం అందేలా చేయడంలో ఈ పరికరం కీలక పాత్ర పోషిస్తుందని శాస్త్రవేత్తలు వెల్లడించారు.

# వేడెక్కిన జమ్ముకశ్మీర్ రాజకీయాలు

**సీఎం ఒమర్ అబ్దుల్లాకు బీజేపీ రూ.100 కోట్ల పరువునష్టం నోటీస్..**



**న్యూఢిల్లీ 13 జూలై మహాప్రభ**
జమ్మూకశ్మీర్ లో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. తమ ప్రభుత్వాన్ని కూల్చేందుకు, ఎమ్మెల్యేలను కొనుగోలు చేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందంటూ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. ఈ ఆరోపణలను తీవ్రంగా పరిగణించిన బీజేపీ.. ఒమర్ అబ్దుల్లాకు రూ.100 కోట్ల పరువు నష్టం నోటీస్ జారీచేసింది. ఏడు రోజుల్లోగా తన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని, లేదంటే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించింది.ఈ నెల 11న తన నాయనమ్మ, 'మదర్-ఎ-మెహర్బాన్'గా పేరుగాంచిన బేగం అక్బర్ జహాన్ 26వ వర్ధంతి సందర్భంగా జరిగిన పార్టీ సమావేశంలో ఒమర్ అబ్దుల్లా బీజేపీపై సంచలన ఆరోపణలు చేశారు. తన నేషనల్ కాన్ఫరెన్స్ (ఎన్‌సీ) ప్రభుత్వాన్ని పడగొట్టేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని అన్నారు. ఇందులో భాగంగా జమ్మూ డివిజన్‌కు చెందిన తమ పార్టీ ఎమ్మెల్యేను ఒక సీనియర్ బీజేపీ నేత సంప్రదించారని, పార్టీ మారితే రూ.20 కోట్ల నుంచి రూ.30 కోట్లు, మంత్రి పదవి, జమ్మూకశ్మీర్‌కు తిరిగి రాష్ట్ర హోదా ఇస్తామని ఆఫర్ చేశారని ఆరోపించారు.జుఇవఎౌఅజవ దీత్ఖుఅఎష్ట్ర సుప్రీంకోర్టులో న్యాయవాదిగా పనిచేస్తున్న ఒక సీనియర్ బీజేపీ నేత ఈ వ్యవహారంలో కీలకపాత్ర పోషించారని కూడా ఆయన పేర్కొన్నారు. ఒమర్ వ్యాఖ్యలతో తమ పార్టీ ప్రతిష్ఠకు తీవ్ర భంగం కలిగిందని బీజేపీ పేర్కొన్నది. జమ్మూకశ్మీర్ బీజేపీ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు సత్‌పాల్ శర్మ ఆదేశాల మేరకు అడ్వకేట్ పరిమోక్ష్ సేథ్ ద్వారా ఈ లీగల్ నోటీసును పంపింది. ఒమర్ చేసిన ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని, నిరాధారమైనవని, దురుద్దేశపూర్వకమైనవని నోటీసులో స్పష్టంచేసింది. ఎలాంటి ఆధారాలు లేకుండా కేవలం రాజకీయంగా దెబ్బతీసేందుకే ఈ వ్యాఖ్యలు చేశారని పేర్కొన్నది. ఈ నేపథ్యంలో ఒమర్ అబ్దుల్లా ఏడు రోజుల్లోగా ఈ ఆరోపణలను లిఖితపూర్వకంగా ఉపసంహరించుకోవాలని, బేషరతుగా బహిరంగ క్షమాపణ చెప్పాలని బీజేపీ డిమాండ్ చేసింది. భవిష్యత్తులో ఇలాంటి వ్యాఖ్యలు పునరావృతం చేయవద్దని కూడా సూచించింది. గడువులోగా ఒమర్ స్పందించకపోతే రూ.100 కోట్ల నష్టపరిహారం కోరుతూ సివిల్ పరువు నష్టం దావా వేస్తామని బీజేపీ హెచ్చరించింది. దీంతోపాటు చట్టంలోని సంబంధిత సెక్షన్ల కింద క్రిమినల్ చర్యలు కూడా ప్రారంభిస్తామని నోటీసులో స్పష్టంచేసింది. ఈ ఆరోపణలను బీజేపీ మొదటి నుంచి ఖండిస్తోంది. రాజకీయంగా ప్రేరేపితమైన ఈ వ్యాఖ్యల వెనుక తమ పార్టీ ప్రతిష్ఠను దెబ్బతీసే కుట్ర ఉందని ఆ పార్టీ నేతలు విమర్శిస్తున్నారు. ఈ నోటీసుతో జమ్మూకశ్మీర్ రాజకీయాలు మరింత వేడెక్కాయి. ఒమర్ అబ్దుల్లా దీనిపై ఎలా స్పందిస్తారన్నది ఆసక్తికరంగా మారింది.

# సీఈవో పోస్టు కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్న అయోధ్య ట్రస్టు

**అయోధ్య: 13 జూలై మహాప్రభ**
అయోధ్యలో కొత్తగా నిర్మించిన రామమందిరాన్ని.. శ్రీ రామ జన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అయితే టెంపుల్ నిర్వహణ, పరిపాలన కోసం ఆలయ ట్రస్టు చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌ను నియమించనున్నది. దీని కోసం ఆసక్తిగల అభ్యర్థుల నుంచి ఆ ట్రస్టు దరఖాస్తులు కోరుతున్నది. సోషల్ మీడియా అకౌంట్‌లో సీఈవో అర్హత గురించి అయోధ్య ట్రస్టు వివరాలు వెల్లడించింది. గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి దరఖాస్తుదారుడు గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి ఉండాలి. ఆర్థిక వ్యవహారాల్లో ఆ వ్యక్తికి కనీసం 20 ఏళ్ల అనుభవం ఉండాలని రామజన్మభూమి ట్రస్టు బోర్డు పేర్కొన్నది. దరఖాస్తు చేసుకోవడానికి జూలై 18వ తేదీ గడువు విధించారు. గతంలో ఆలయాలకు ఆర్థిక వ్యవహారాలు



నిర్వహించిన వారికి ప్రాధాన్యత ఇవ్వడం జరుగుతుంది. దరఖాస్తుదారుడు కచ్చితంగా హిందూ మత విశ్వాసి అయి ఉండాలి.మరో వైపు అయోధ్య రామాలయంలో నిధులను చోరీ చేసిన కేసులో దర్యాప్తు వేగంగా సాగుతోంది. ఈ కేసులో కేంద్రానికి, అయోధ్య ట్రస్టు బోర్డుకు, యూపీ ప్రభుత్వానికి.. సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసిన విషయం తెలిసిందే. నిధుల చోరీపై యూపీ సర్కారు ఏర్పాటు చేసిన సిట్ దర్యాప్తు బృందం నివేదికను వెల్లడించాలని కూడా సుప్రీం తన ఆదేశాల్లో స్పష్టం చేసింది. సీఈవోగా నియమితుడైన వ్యక్తికి మూడేళ్ల పాటు ఆ బాధ్యతలు నిర్వర్తించాల్సి ఉంటుంది. ఆ వ్యక్తి అయోధ్యలోనే బస చేయాలి. సెలెక్షన్ ప్రక్రియలో భాగంగా దరఖాస్తుదారులను షార్ట్‌లిస్టు చేస్తారు, ఆ తర్వాత వారికి ఇంటర్వ్యూలను ఏర్పాటు చేయనున్నారు. రామ మందిర నిర్వహణకు పరిపాలనా అధికారిగా సీఈవో ఉంటారని, మిగితా వారంతా ట్రస్టుకు బాధ్యులై ఉంటారని తీర్థక్షేత్ర ట్రస్టు బోర్డు పేర్కొన్నది.

# మూడేళ్ల చిన్నారిపై వ్యక్తి అత్యాచారం..

**- లక్ష జరిమానా విధించిన పంచాయతీ**

**రాంచి 13 జూలై మహాప్రభ**
ఒక వ్యక్తి మూడేళ్ల చిన్నారిపై అత్యాచారానికి పాల్పడ్డాడు. అయితే ఈ నేరాన్ని కప్పిపుచ్చేందుకు గ్రామ పంచాయతీ పెద్దలు ప్రయత్నించారు. నిందితుడికి లక్ష జరిమానా విధించారు. అతడు చెల్లించిన కొంత డబ్బుతో మందు పార్టీ జరుపుకున్నారు. (ఖుఅఎష్ట్రఖుఎ్రాబఅఅంష్ట్రఎవత్) ఈ సమాచారం తెలుసుకున్న పోలీసులు నిందితుడిని అరెస్ట్ చేశారు. జార్ఖండ్‌లోని గుమ్లా జిల్లాలో ఈ సంఘటన జరిగింది. ఒక గ్రామానికి చెందిన సునీల్ లోహ్‌రా, శనివారం సాయంత్రం ఒక ఇంటికి వెళ్లాడు. ఒక మహిళ ఇంటి పనులు చేసుకుంటుండగా ఆమె మూడేళ్ల కుమార్తెను తన వద్ద ఉంచుతానని చెప్పాడు. ఆ తర్వాత ఆ చిన్నారిని మరో గదిలోకి తీసుకెళ్లి లైంగిక



దాడికి పాల్పడ్డాడు.కాగా, ఆ బాలిక ఏడ్పు విన్న తల్లి పరుగున వచ్చింది. గాయాలతో ఏడుస్తున్న ఆ చిన్నారిని ప్రైవేట్ వైద్యుడి వద్దకు తీసుకెళ్లగా లైంగిక దాడి జరిగినట్లు బయటపడింది. ఈ విషయం తెలుసుకున్న పంచాయతీ పెద్దలు పోలీసులకు ఫిర్యాదు చేయనీయకుండా నిలువరించారు. ఆదివారం గ్రామంలో పంచాయతీ నిర్వహించి నిందితుడికి లక్ష జరిమానా విధించారు. అందులో రూ.20,000 అతడు చెల్లించగా మాంసం, మద్యంతో విందు ఏర్పాటు చేశారు. మిగతా రూ.80,000 వారం రోజుల్లోగా చెల్లించాలని నిందితుడికి సూచించారు. మరోవైపు కొందరు గ్రామస్తుల ద్వారా ఈ విషయం పోలీసులకు తెలిసింది. దీంతో ఘాఘ్రా పోలీసులు ఆ గ్రామానికి వెళ్లి చిన్నారి తల్లి నుంచి వివరాలు సేకరించారు. ఆమె వాంగ్మూలం ఆధారంగా కేసు నమోదు చేశారు. కొంత జరిమానా డబ్బుతో ఏర్పాటు చేసిన విందులో పాల్గొన్న నిందితుడు సునీల్‌ను అరెస్ట్ చేశారు. అయితే చిన్నారిపై లైంగిక దాడి ఘటన తర్వాత పాల్మా గ్రామంలో ఒక సమావేశం జరిగిందని ఆరంగి పంచాయతీ ప్రెసిడెంట్ లోడో ఎక్కా తెలిపారు. ఆ సమావేశం గురించి తనకు ఎటువంటి సమాచారం లేదని చెప్పారు. పోలీసులు గ్రామంలోకి వచ్చిన తర్వాతే దీని గురించి తనకు తెలిసిందని ఆయన అన్నారు.

# అమెరికా సైనిక స్థావరాలపై భీకర ప్రతీకార దాడులు చేశాం : ఇరాన్

**న్యూఢిల్లీ 13 జూలై మహాప్రభ**
ఇరాన్ పై అమెరికా జరిపిన తాజా వైమానిక దాడుల కు ప్రతీకారంగా గల్ఫ్ ప్రాంతంలోని అమెరికా సైనిక స్థావరాలపై భారీ క్షిపణి , డ్రోన్ దాడులు చేసినట్లు ఇరాన్ ప్రకటించింది. ఫిబ్రవరిలో ప్రారంభమైన ఘర్షణల తర్వాత ఇదే తమ అతిపెద్ద ప్రతీకార ఆపరేషన్ అని ఇరాన్



ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ వెల్లడించింది. అమెరికా దాడుల్లో బందర్ అబ్బాస్ , ఖెష్మ్ ద్వీపం పరిసరాల్లోని క్షిపణి, వైమానిక రక్షణ వ్యవస్థలు లక్ష్యంగా మారినట్లు సమాచారం.కువైట్, ఖతార్, బహ్రెయిన్, ఒమన్, జోర్డాన్‌లోని అమెరికా సైనిక స్థావరాలపై దాడులు నిర్వహించినట్లు ఐఆర్‌జీసీ ప్రకటించింది. కువైట్‌లో అమెరికా పేట్రియాట్ క్షిపణి వ్యవస్థలు, రాడార్ కేంద్రాలు, ఆయుధ నిల్వలను డ్రోన్లతో ధ్వంసం చేశామని తెలిపింది. అలాగే ఒమన్‌లోని డుక్మ్ పోర్టులో అమెరికా నౌకాదళానికి చెందిన సదుపాయాలు, బహ్రెయిన్‌లోని షేక్ ఇసా ఎయిర్‌బేస్, ఖతార్‌లోని అల్ ఉదైద్ ఎయిర్‌బేస్‌పై కూడా దాడులు చేసినట్లు పేర్కొన్నది. జోర్డాన్‌లోని ప్రిన్స్ హసన్ ఎయిర్‌బేస్‌లో ఇంధన ట్యాంకులు, మందుగుండు సామగ్రి నిల్వలకు నిప్పు అంటించినట్లు కూడా ప్రకటించింది. దాడులు మళ్లీ జరిగితే మరింత తీవ్రంగా ప్రతిస్పందిస్తామని అమెరికాను హెచ్చరించింది. కాగా, యుద్ధ విమానాలు, నౌకలు, డ్రోన్లతో ఇరాన్‌లోని డజన్ల కొద్దీ లక్ష్యాలపై దాడులు నిర్వహించినట్లు అమెరికా ప్రకటించింది. వైమానిక రక్షణ వ్యవస్థలు, తీర ప్రాంత రాడార్లు, క్షిపణి, డ్రోన్ మౌలిక సదుపాయాలు, చిన్న యుద్ధ నౌకలను లక్ష్యంగా చేసుకున్నట్లు వెల్లడించింది. హర్మూజ్ జలసంధిలో పౌర నౌకాయానానికి ముప్పు తగ్గించేందుకే ఈ చర్యలు చేపట్టినట్లు సెంట్‌కామ్ తెలిపింది.

# సేవా కార్యక్రమం కోసం వృద్ధుడి సాహసం..

**91 ఏళ్ల వయస్సులో స్కైడైవింగ్**

**న్యూఢిల్లీ 13 జూలై మహాప్రభ**
వయసు కేవలం ఒక సంఖ్య మాత్రమేనని నిరూపిస్తూ 91 ఏళ్ల వృద్ధుడు చేసిన సాహసం అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. బ్రిటన్ లోని సర్రీ కౌంటీ క్రేన్లీ గ్రామానికి చెందిన 91 ఏళ్ల వృద్ధుడు అలాన్ స్టీల్,



సేవా కార్యక్రమాల కోసం నిధులు సేకరించాలనే గొప్ప సంకల్పంతో స్కైడైవింగ్ చేసి అందరికీ స్ఫూర్తిగా నిలిచారు. ఈ సాహసం ద్వారా ఆయన సుమారు రూ.4.76 లక్షలకుపైగా విరాళాలను సేకరించారు.ఈ మొత్తాన్ని ఆయన 'రోలీస్ కమ్యూనిటీ సెంటర్'కు అందజేశారు. వయసు మళ్లినా ఆయన చూపిన సాహసం, సేవా దృక్పథంపై ప్రశంసల వర్షం కురుస్తోంది. కాగా విమానం నుంచి స్కైడైవింగ్ చేసిన ఆ అద్భుత క్షణాలను తన జీవితంలో ఎప్పటికీ మర్చిపోలేనని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. 91 ఏళ్ల వయసులో ఈ అరుదైన ఘనత సాధించిన అలాన్ స్టీల్, అప్పుడే తన తదుపరి సాహసానికి సిద్ధమవుతున్నారు. బ్రిటన్‌లోని వేల్స్ ప్రాంతంలో గంటకు 160.9 కిలోమీటర్ల వేగంతో దూసుకెళ్లే 'జిప్ లైన్' రైడ్‌ను పూర్తి చేయడమే తన తదుపరి లక్ష్యమని చెప్పారు.

## సంపాదకీయం

# సర్: ప్రవాస ఓటర్ల మాటేమిటి?




విదేశాలలో, ప్రత్యేకించి గల్ఫ్ దేశాలలో ఉపాధి పొందుతున్న తెలుగువారు లక్షల సంఖ్యలో ఉన్నారు. ఈ తెలుగు ప్రవాసుల ఉనికి విషయమై ఉభయ తెలుగు రాష్ట్రాలలో పాలకులకుగానీ, రాజకీయ పక్షాలకుగానీ శ్రద్ధాసక్తులు లేవు. కారణమేమిటి? తమ ప్రాధాన్యాన్ని విడమర్చి చెప్పడంలో ప్రవాసుల వైఫల్యమే, సందేహం లేదు. పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తూ చౌకబారు ప్రచారం చేసుకునే ప్రవాసుల సంఘాలు మాతృదేశంలో జాతి భవిష్యత్తును నిర్ణయాత్మకంగా ప్రభావితం చేసే పరిణామాల పట్ల ఉదాసీనత అవలంబించడం సహేతుకమేనా? నాయకులమని చెప్పుకునే వారిలో నిర్మాణాత్మక దృక్పథం లోపించడం నిరాశా నిస్పృహలు కలిగిస్తోంది.జీవనోపాధికై గల్ఫ్ దేశాలకు వచ్చిన తెలుగువారిలో అత్యధికులు గ్రామీణులే. వీరి విద్యార్హతలు అంతంత మాత్రమే. చిన్న చితకా పనులు చేస్తూ ప్రతి నెలా క్రమం తప్పకుండా పెట్రో దినార్లను పంపడం ద్వారా స్వదేశంలోని కుటుంబాలను పోషించుకునే ఈ శ్రామిక జనులలో ఎక్కువ భాగం బడుగు, బలహీన వర్గాలవారే. పరాయి దేశంలో నివసిస్తున్నా, వారి మనసంతా సదా మాతృదేశమూ, కన్న ఊరు చుట్టే. భారత ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ జాబితాల ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమంలో భాగంగా ఉభయ తెలుగు రాష్ట్రాల్లో మొదలైన ఆ 'సవరణ' ప్రక్రియ అసంఖ్యాక ప్రవాసులపై ప్రత్యక్ష, పరోక్ష ప్రభావం చూపించడం ఖాయం. ఇప్పటి వరకు 'సర్' పూర్తయిన రాష్ట్రాలలో లక్షలాది వలస కార్మికులు, మహిళలు నష్టపోయారనేది కొట్టివేయలేని ఒక కఠోర సత్యం. ఇక విదేశీ ఉపాధి వలసలు ఎక్కువగా ఉన్న తెలుగు రాష్ట్రాలలో 'సర్' ప్రభావం ముమ్ముందు ఉంటుందనే వాస్తవాన్ని ప్రవాసులు అంతగా అర్థం చేసుకోవడం లేదు. 2002 సంవత్సరం నాటి ఓటర్ల జాబితాతో నూతన ఓటర్లను అనుసంధానం చేసే మ్యాపింగ్ ప్రక్రియ ఈ 'సవరణ'లో అత్యంత కీలక భాగం. ప్రవాస కార్మికులు అవగాహనా రాహిత్యంతో ఈ విషయాన్ని పట్టించుకోవడం లేదు. వారికి సరైన మార్గదర్శకత్వం చేసే నాయకత్వం కూడా కరువయింది. గల్ఫ్‌లో వివిధ రాజకీయ పార్టీల కార్యక్రమాలను పండుగల తరహాలో నిర్వహిస్తూ నాయకులమని చెప్పుకునే పెద్ద మనుషులు సైతం 'సర్'పై శ్రద్ధ చూపడం లేదు.సర్' వలన అస్మదీయులు-- తస్మదీయులు అనే వివక్ష లేకుండా వేలాడుతున్న కత్తి వైపు కన్నెత్తి చూడకపోవడం ఆశ్చర్యాన్ని కలిగిస్తోంది. తుది జాబితా అనంతరం తెలుగు రాష్ట్రాలలోని కొన్ని నియోజకవర్గాల ముఖచిత్రాలు మారిపోతాయి. ఉదాహరణకు ఆంధ్రప్రదేశ్‌లో తిరుపతి జిల్లాలోని పుల్లంపేట, కోనసీమ జిల్లా సఖినేటిపల్లి, శ్రీకాకుళం జిల్లా పలాస మండలాలు; తెలంగాణలోని నిజామాబాద్ జిల్లా వేల్పూరు, జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలాలలోని పలు గ్రామాల వారు అనేక మంది, కచ్చితంగా చెప్పాలంటే ప్రతి గ్రామ జనాభాలోనూ సగం మంది కంటే ఎక్కువగా గల్ఫ్ దేశాలలో జీవనోపాధి పొందుతున్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాలలోని గ్రామీణ ప్రాంతాలతో పాటు హైదరాబాద్ మహానగర పాతబస్తీలోని అన్ని నియోజకవర్గాల నుంచి కూడా గల్ఫ్‌కు వలస వచ్చిన ఓటర్లు గణనీయమైన సంఖ్యలో ఉన్నారు. సక్రమంగా 'సవరణ' జరిగి, ప్రస్తావిత ప్రాంతాల ఓటర్ జాబితాల నుంచి భారీ సంఖ్యలో ఓట్లను తొలగించవల్సి వస్తే అనేక నియోజకవర్గాల రాజకీయ ముఖచిత్రాలు మారిపోతాయి. ప్రజాప్రాతినిధ్య చట్టం ప్రకారం, ఒక వ్యక్తి ఒక ప్రదేశంలో ఆరు నెలలకు మించి నివాసం ఉండని పక్షంలో అతను లేదా ఆమె పేరును తొలగించాలి, ప్రవాసులే కాదు, రాజకీయ నాయకులు సైతం ఓటరుగా తాము నమోదైన ప్రదేశాలలో నివసిస్తూ ఉండరనేది వేరే విషయం. ప్రవాసులు తమ పాస్‌పోర్టుల్లో చిరునామాగా పేర్కొన్న ప్రదేశంలో ప్రవాస ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం ఉన్నది. అయితే దేశవ్యాప్తంగా ఇలా ప్రవాస ఓటరుగా నమోదు చేసుకునే వారి సంఖ్య స్వల్పాతి స్వల్పమే. ప్రవాస ఓటరుగా నమోదయితే రేషన్‌కార్డు గల్లంతవుతుందనే భయానికి తోడుగా పేర్లు, వయస్సులోని వ్యత్యాసాల కారణాన ఈ రకమైన నమోదుకు అత్యధికులు ఇష్టపడడం లేదు. ప్రవాసులకు సంబంధించిన ఈ కీలక అంశాలపై సరైన సమాచారంతో సుదూర దేశంలో బతుకుదెరువు పొందుతున్న తోటి స్వదేశీయులకు దిశా నిర్దేశం చేయవల్సిన ప్రవాస నాయకగణం పట్టించుకోవడమే లేదు. ఈ ఉపేక్షా వైఖరికి వారు తక్షణమే స్వస్తి చెప్పాలి.

# ఓటు హక్కు మన బాధ్యత ఎస్ఐఆర్ ప్రక్రియలో తప్పక భాగస్వాములు కండి.





**గడ్డి అన్నారం 13 జూలై మహాప్రభ**
గడ్డిఅన్నారం డివిజన్ పరిధిలో ఎస్ ఐ ఆర్ కార్యక్రమంలో భాగంగా జరుగుతున్న ఓటర్ ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ సందర్భంగా, ఫారం నింపే విషయంలో ప్రజలు అవగాహన లేక కొన్ని పొరపాట్లు చేస్తున్న నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో వివిధ కాలనీలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గడ్డిఅన్నారం డివిజన్ మాజీ కార్పొరేటర్ బద్దం ప్రేమ్ మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, ఓటు హక్కు ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధమైన హక్కు మాత్రమే కాకుండా బాధ్యత కూడా అని పేర్కొన్నారు. ఎస్ ఐ ఆర్ కార్యక్రమం ఉద్దేశ్యాన్ని ప్రజలకు వివరించి, ఓటర్ ఫారాన్ని సరైన విధంగా ఎలా నింపాలి, అవసరమైన పత్రాలు ఏమిటి, ఫారం నింపేటప్పుడు ఎలాంటి తప్పులు చేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలి అనే అంశాలపై సవివరంగా అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతి ఓటరు తమ వివరాలను సక్రమంగా నమోదు చేసుకుని, అవసరమైన పత్రాలతో ఫారాలను పూర్తి చేసి నిర్ణీత గడువులోగా సమర్పించాలని ఆయన కోరారు. ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయాలంటే ప్రతి ఒక్కరూ ఎస్ ఐ ఆర్ ప్రక్రియలో చురుకుగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ అవగాహన కార్యక్రమంలో భారతీయ జనతా పార్టీ నాయకులు, బూత్ అధ్యక్షులు, బూత్ లెవల్ ఏజెంట్లు బీ ఎల్ ఓ లను, కార్యకర్తలు, కాలనీ ప్రతినిధులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## తూప్రాన్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో
# ఘనంగా ఉచిత పశువైద్య శిబిరం






**-ఇస్లాంపూర్ గోశాలలో ఆవులు, లేగదూడలకు ఉచిత వైద్య సేవలు**

**-బలసంవర్ధక మందుల పంపిణీ**

**-పశుసంపద పరిరక్షణకు లయన్స్ క్లబ్ సేవలు అభినందనీయం**

**- ముఖ్య అతిథి లయన్ డాక్టర్ లింగమూర్తి**

**తూప్రాన్, జూలై 13,(మహాప్రభ)**
సేవా కార్యక్రమాలకు చిరునామాగా నిలుస్తున్న తూప్రాన్ లయన్స్ క్లబ్ మరోసారి తన సామాజిక బాధ్యతను చాటుకుంది. పశుసంపద సంరక్షణే గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అనే లక్ష్యంతో సోమవారం ఉదయం ఇస్లాంపూర్ లంబాడీ తాండలో గణపతి టెక్స్‌టైల్ యజమాని శివరామ్‌కు చెందిన గోశాలలో ఉచిత పశువైద్య శిబిరాన్ని ఘనంగా నిర్వహించింది. లయన్ డాక్టర్ లింగమూర్తి సహకారంతో నిర్వహించిన ఈ శిబిరంలో గోశాలలోని ఆవులు, లేగదూడలకు సమగ్ర వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు ఉచితంగా అందజేశారు. శిబిరంలో పశువుల ఆరోగ్య పరిరక్షణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ దాదాపు 25 వేల రూపాయల విలువైన పలు రకాల మందులను పంపిణీ చేశారు. ఎదుగుదలకు అవసరమైన జెనోవా ట్యాబ్లెట్లు, నట్టల నివారణకు పెన్‌బెండోజోల్, అల్‌బెండోజోల్, ఎముకలు దృఢంగా మారేందుకు ఖనిజాల మందులు, పాల ఉత్పత్తి పెంచేందుకు ప్రత్యేక సప్లిమెంట్లు, పొదుగు వాపు, పుండ్ల నివారణకు మ్యాస్టికేర్, స్కిన్ హీల్ ఆయింట్‌మెంట్, ఉబ్బరం, గ్యాస్ సమస్యలకు బ్లోటోసిల్, అజీర్తి నివారణకు యాంటీబయోటిక్స్, లివర్ టానిక్, ఆకలి పెంచేందుకు డైజిన్, సాధారణ ఆరోగ్య సమస్యల నివారణకు హెచ్.బి. స్ట్రాంగ్‌తో పాటు బలసంవర్ధక మందులను పంపిణీ చేశారు. ప్రతి పశువును పరిశీలించి దాని ఆరోగ్య పరిస్థితికి అనుగుణంగా చికిత్స అందించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి లయన్ డాక్టర్ లింగమూర్తి మాట్లాడుతూ, పశుసంపద రైతు కుటుంబాలకు ప్రధాన ఆర్థిక ఆధారమని, పశువుల ఆరోగ్యాన్ని కాపాడుకోవడం ద్వారా పాల ఉత్పత్తి పెరిగి రైతులకు అదనపు ఆదాయం లభిస్తుందని తెలిపారు. ఇటువంటి ఉచిత పశువైద్య శిబిరాలు గ్రామీణ ప్రాంతాల్లో మరింత విస్తరించాలని, లయన్స్ క్లబ్ చేపడుతున్న సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు.
తూప్రాన్ లయన్స్ క్లబ్ అధ్యక్షులు లయన్ డాక్టర్ జానకిరామ్ సీఆర్ మాట్లాడుతూ, విద్య, వైద్యం, పర్యావరణ పరిరక్షణతో పాటు పశుసంరక్షణ రంగంలోనూ లయన్స్ క్లబ్ సేవలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు. రైతులు, పశుపోషకులకు అవసరమైన ప్రతి సందర్భంలో లయన్స్ క్లబ్ అండగా ఉంటుందని చెప్పారు. శిబిరం ద్వారా పెద్ద సంఖ్యలో పశువులకు ఉచిత వైద్య సేవలు అందడంతో పశు పోషకులు తూప్రాన్ లయన్స్ క్లబ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇటువంటి సేవా కార్యక్రమాలు తరచూ నిర్వహించాలని వారు కోరారు. ఈ శిబిరంలో లయన్ దేవత సాయికిరణ్ గుప్త, లయన్ కొక్కొండ చంద్రశేఖర్ రెడ్డి, చేగుంట లయన్స్ క్లబ్ అధ్యక్షులు రజనకు రామచంద్రం, రాజు నాయక్, గోశాల యజమాని శివరామ్‌తో పాటు లయన్స్ క్లబ్ సభ్యులు, గ్రామస్తులు, పశుపోషకులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్‌లో మళ్లీ ముదిరిన వర్గపోరు..!

**-జూపల్లి మల్లారెడ్డిపై క్రమశిక్షణ చర్యలకు పీసీసీకి ఫిర్యాదు చేస్తాం**

**-నర్సారెడ్డి వర్గం హెచ్చరిక**

**-"నర్సన్నపై ఈగ వాలినా సహించం...**

**-స్థాయికి మించి మాట్లాడితే తీవ్ర పరిణామాలు తప్పవు"**




**తూప్రాన్, జులై 13.(మహాప్రభ)**
గజ్వేల్ కాంగ్రెస్‌లో వర్గ విభేదాలు మరోసారి బహిర్గతమయ్యాయి. గజ్వేల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే తూముకుంట నర్సారెడ్డిపై ఇటీవల చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో తూప్రాన్ కాంగ్రెస్ నాయకులు జూపల్లి మల్లారెడ్డిపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘిస్తూ, వ్యక్తిగత దూషణలకు దిగిన మల్లారెడ్డిపై తెలంగాణ పీసీసీ అధ్యక్షుడు పి. మహేష్ కుమార్ గౌడ్, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ దృష్టికి తీసుకెళ్లి క్రమశిక్షణ చర్యలు తీసుకునేలా ఫిర్యాదు చేస్తామని స్పష్టం చేశారు. నాచారం దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ పల్లెర్ల రవీందర్ గుప్త, తూప్రాన్ మార్కెట్ కమిటీ చైర్మన్ యాంజాల విఠల్ రెడ్డి, వైస్ చైర్మన్ మామిండ్ల కృష్ణ, కాంగ్రెస్ నాయకుడు వీరభోయిన గోపాల్, రామునిగారి చిన్న నాగరాజు గౌడ్ లు మాట్లాడుతూ "రియల్ ఎస్టేట్ బ్రోకర్‌గా, భూ కబ్జాల ఆరోపణలు ఎదుర్కొన్న చరిత్ర ఉన్న జూపల్లి మల్లారెడ్డి తన స్థాయిని మరిచి అసభ్య పదజాలంతో నర్సారెడ్డిపై మాట్లాడడం తీవ్రంగా ఖండిస్తున్నాం" అని మండిపడ్డారు.
వారు మాట్లాడుతూ "18 గంటల పాటు ప్రజల కోసం కష్టపడే నాయకుడు, సర్పంచ్ నుంచి ఎమ్మెల్యే వరకు అన్ని స్థాయిల్లో ప్రజాసేవ చేసిన నర్సారెడ్డిపై వ్యక్తిగత విమర్శలు చేయడం కాంగ్రెస్ సంస్కృతి కాదు. రాజకీయ విమర్శలు చేయాలంటే ఆధారాలతో చేయాలి కానీ, బూతు భాషతో మీడియా ముందుకు రావడం సిగ్గుచేటు" అని ధ్వజమెత్తారు. "నర్సన్న పుణ్యాన రాజకీయంగా గుర్తింపు పొందిన వ్యక్తి, ఇప్పుడు అదే నర్సారెడ్డిపై నోరు పారేసుకోవడం కృతఘ్నతకు నిదర్శనం" అని వ్యాఖ్యానించారు. మల్లారెడ్డి మాట్లాడే భాష, ప్రవర్తన మార్చుకోకపోతే కాంగ్రెస్ కార్యకర్తలు చూస్తూ ఊరుకోరని, తగిన రీతిలో బుద్ధి చెబుతామని హెచ్చరించారు. బజారు విశ్వరాజు ఒకటో వార్డు కౌన్సిలర్‌గా పోటీ చేస్తానని చివరి నిమిషంలో తప్పుకోవడం వల్ల కాంగ్రెస్ అభ్యర్థి షారుక్ ఓటమికి కారణమయ్యారని కూడా ఆరోపించారు. తూముకుంట నర్సారెడ్డిని గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జిగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పార్టీ అధిష్ఠానం నియమించిందని, ఏడు మండలాల కమిటీల నియామకాల ప్రక్రియలో కూడా నర్సారెడ్డితో సంప్రదింపుల అనంతరమే పీసీసీ అధ్యక్షుడు ఉత్తర్వులు జారీ చేశారని పేర్కొన్నారు. కొన్ని మండల కమిటీల విషయంలో సమాచార లోపాలు ఉన్నాయనే కారణంతో పార్టీని బలహీనపరిచేలా మీడియా ముందుకు వచ్చి వ్యక్తిగత దూషణలకు దిగడం సరికాదన్నారు.
"పదవులు శాశ్వతం కావు... కాంగ్రెస్ పార్టీ శాశ్వతం. పార్టీ ఇచ్చిన పదవిని పార్టీ బలోపేతానికి వినియోగించాలి తప్ప, సీనియర్ నాయకులను అవమానించడానికి కాదు" అని హెచ్చరించారు. నర్సారెడ్డి రాజకీయ జీవితాన్ని ప్రస్తావిస్తూ, "సర్పంచ్, ఎంపీపీ, డీసీసీబీ ఛైర్మన్, డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యేగా అపార అనుభవం ఉన్న రాష్ట్రస్థాయి సీనియర్ నాయకుడిపై బురద జల్లే ముందు మీ రాజకీయ చరిత్రను ఒకసారి చూసుకోండి" అని మల్లారెడ్డికి సూచించారు. "మేము కాంగ్రెస్... మీరు కూడా కాంగ్రెస్. కనీస పార్టీ క్రమశిక్షణ, రాజకీయ సంస్కారం లేకుండా ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే అధిష్ఠానం ముందు జవాబు చెప్పాల్సిందే. నర్సన్నపై ఈగ వాలినా సహించం. అవసరమైతే పీసీసీ, డీసీసీ స్థాయిలో ఫిర్యాదు చేసి కఠిన చర్యలు తీసుకునేలా చేస్తాం" అని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ చైర్మన్ యాంజాల విఠల్ రెడ్డి, వైస్ చైర్మన్ మామిండ్ల కృష్ణ, నాచారం దేవస్థానం ట్రస్ట్ బోర్డు చైర్మన్ పల్లెర్ల రవీందర్ గుప్త, కౌన్సిలర్లు రామునిగారి చిన్న నాగరాజు గౌడ్, బొడ్డు వేణు, దుర్గం నగేష్, కమ్మరి వెంకటేశం, నాయిని నర్సింలు గౌడ్, నాయిని ఆంజనేయులు గౌడ్, జింక మల్లేష్, జిన్నా భగవాన్ రెడ్డి, మాణిక్ రావు, ఇస్లాంపూర్ సర్పంచ్ సంతోష్ రెడ్డి, ధాతర్‌పల్లి సర్పంచ్ జయరాములు, మహేందర్‌తో పాటు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

## కేజీబీవీ చింతపల్లిలో రెండు వంట మనుషుల పోస్టులు ఖాళీ




దేవరకొండ డివిజన్ జూలై 13 ( మహాప్రభ ) చింతపల్లి మండల. కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లో రెండు వంట మనుషుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని మండల విద్యాధికారి (ఎంఈఓ) తెలిపారు. ఈ పోస్టుల భర్తీ కోసం అర్హత కలిగిన మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు.
ఆసక్తి గల మహిళా అభ్యర్థులు ఈ నెల 16వ తేదీలోపు సంబంధిత పాఠశాల స్పెషల్ ఆఫీసర్‌కు దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. అభ్యర్థులు 40 సంవత్సరాల లోపు వయస్సు కలిగి ఉండటంతో పాటు పదో తరగతి ఉత్తీర్ణులు అయి ఉండాలని తెలిపారు. ఈ పోస్టులకు అభ్యర్థుల ఎంపికను మండల తహసీల్దార్ (ఎంఆర్ఓ), మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీవో), మండల విద్యాధికారి (ఎంఈఓ) సభ్యులుగా ఉండే త్రిసభ్య కమిటీ ద్వారా నిర్వహించనున్నట్లు ఎంఈఓ వెల్లడించారు.

## ఘనంగా ఎస్పిఆర్ స్కూల్లో ఫ్రెషర్స్ డే సంబరాలు



దేవరకొండ జూలై 13( మహాప్రభ
స్థానిక ఎస్ పి ఆర్ స్కూల్ ఆఫ్ ఎక్సలెన్స్ సోమవారం ఉదయం నుండి సాయంత్రం వరకు ఫ్రెషర్స్ డే పురస్కరించుకొని విద్యార్థిని విద్యార్థులు సంప్రదాయ వస్త్రములు ధరించి డాన్సులు నిర్వహించారు"" మామిడి కోణాల మీద అనే పాట మీద ఒక విద్యార్థిని చాలా చక్కగా సంప్రదాయబద్ధంగా డాన్స్ నిర్వహించి అందరిని ఆకర్షించింది అదే సాంగు ఆరో తరగతి చిన్నారులు నిర్వహించి అందరిని ఆనందపరిచారు. కార్యక్రమానికి వచ్చిన పేరెంట్స్ విద్యార్థులు కరతాలదనులతో ప్రాంగణమంతా మారు మ్రోగింది, మధ్య మధ్యలో ఉపాధ్యాయుల యొక్క అమూల్యమైన సందేశాలు ఇచ్చారు,. ఈ కార్యక్రమంలో స్కూల్ యాజమాన్యం లింగమయ్య, కృష్ణమూర్తి, శ్రీనివాస్, రవి, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయునిలు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొని సంతోషించారు.

## దేవరకొండ డిపో నుండి హైదరాబాదుకు ఎలక్ట్రికల్ బస్సులు ప్రతిరోజు అందుబాటులో ఉంటాయి

-డిపో మేనేజర్ :విజయ కుమారి



దేవరకొండ జూలై 13 ( మహాప్రభ )
దేవరకొండ ఆర్టీసీ డిపో నుంచి నూతనంగా హైదరాబాద్ రూట్ లో ఎలక్ట్రికల్ డీలక్స్ బస్సులు నడిపిస్తున్నట్లు డిపో మేనేజర్ విజయకుమారి తెలిపారు. సోమవారం బస్సులు ప్రారంభించిన అనంతరం మాట్లాడుతూ.. దేవరకొండ-హైదరాబాద్ రూట్లో ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండటం వల్ల కొత్తగా 4 ఈ-డీలక్స్ బస్సులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దేవరకొండ నుంచి హైదరాబాద్ కు రూ.170.00, కొండమల్లేపల్లి నుంచి రూ.160.00 చార్జీలు వర్తిస్తాయని తెలిపారు. ఈ బస్సులలో "మహాలక్ష్మి పథకం" వర్తించదని అన్నారు. డిపో పరిధిలోని ప్రయాణికులు ప్రైవేటు వాహనాలను ఆశ్రయించకుండా ఆర్టీసీ బస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ పడాల సైదులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.
**దేవరకొండ నుంచి టైమింగ్స్:**
5:20, 9:30,10:15,11:15, 13:45, 17:15, 18:00, 19:00.
**హైదరాబాద్ నుంచి టైమింగ్స్:**
6:30, 7:15, 8:15, 10:30, 14:15, 15:00,16:00, 18:30.

## ధర్మారం పాఠశాలల్లో ఆరోగ్య అవగాహన కార్యక్రమం





**జాతీయ నులి పురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు నులిపురుగుల మాత్రల పంపిణీ**

**రామాయంపేట, జూలై 13 (మహాప్రభ)**
జాతీయ నిర్మూలన దినోత్సవం - National Deworming Day సందర్భంగా ధర్మారం పాఠశాలల్లో విద్యార్థులకు నులిపురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేశారు.
ఈ కార్యక్రమంలో భాగంగా పాఠశాల ఉపాధ్యాయులు మరియు వైద్య సిబ్బంది డాక్టర్ ప్రదీప్ రావు మెడికల్ ఆఫీసర్ , ధర్మారం వెంకటేశం సూపర్వైజరూ, రమ ఏఎన్ఎం , విద్యార్థులకు అల్బెండజోల్ మాత్రలు అందించారు. మాత్రలు ఎలా వేసుకోవాలో, వాటి వల్ల కలిగే ప్రయోజనాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు.
**కార్యక్రమ ముఖ్య ఉద్దేశం:**
1 సంవత్సరం నుండి 18 సంవత్సరాల వయస్సు గల పిల్లల్లో నులిపురుగుల సమస్యను నిర్మూలించడం, రక్తహీనతను నివారించడం, పిల్లల ఎదుగుదల మరియు చదువులో ఏకాగ్రత , అలాగే చేతులు శుభ్రంగా కడుక్కొని ఆకు కూరగాయలు వేడి చేసిన నీళ్లతోటి కడుక్కొని తినాలి ఇలా చేయడం వల్ల పిల్లలు ఆరోగ్యంగా ఉంటారు పాఠశాల ఆవరణలో ఉపాధ్యాయులు, సిబ్బంది విద్యార్థుల పర్యవేక్షణలో మాత్రలు వేయించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు ఈ కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. వైద్యులు డాక్టర్ ప్రదీప్ రావు మాట్లాడుతూ ప్రతి 6 నెలలకు ఒకసారి ఈ మాత్రలు వేసుకోవాలని, తద్వారా పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని సూచించారు.

## ఎంకెఆర్ డిగ్రీ కళాశాలలో "" వరల్డ్ పాపులేషన్ డే ఘనంగా నిర్వహించారు

-ఇన్చార్జి ప్రిన్సిపాల్, కోటయ్య



**దేవరకొండ జూలై 13( మహాప్రభ )**
మునగాల కొండల్ రావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వయం ప్రతిపత్తి), దేవరకొండలో ఎకనామిక్స్ విభాగం ఆధ్వర్యంలో "వరల్డ్ పాపులేషన్ డే" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ఇంచార్జ్ ప్రిన్సిపాల్ జి.కోటయ్య మాట్లాడుతూ జనసాంద్రత పెరిగే కొద్దీ అనేక సమస్యలు సవాళు ఎదురవుతాయని కాబట్టి వివిధ రంగాలలో నైపుణ్యాన్ని పెంపొందించుకొని సంపద సృష్టించుకునే సామర్థ్యాన్ని కలిగి ఉండాలని ప్రపంచంలో ఎక్కడా లేని యువత మన దేశంలో ఉన్నారని. ఈ యువత మంచి నైపుణ్యాన్ని పెంపొందించుకుంటే భారతదేశం అగ్రగామిగా నిలుస్తుందిఅని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎకనామిక్స్ విభాగాధిపతి ఽ కళాశాల అకాడమిక్ కోఆర్డినేటర్ సి. లింగమయ్య, డాక్టర్ కె.రేణుక, డాక్టర్ వి.మకట్లాల్, జగపతిబాబు, శ్రీనివాస్, నాగరాజు, శ్రీను, నర్మదా దేవి తదితర అధ్యాపకులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాష్ట్ర కుమ్మరుల తొలి బోనాల జాతరకు ఎంపీ ఈటల రాజేందర్‌కు ఆహ్వానం.



ఎల్ బి నగర్
జూలై 13 (మహాప్రభ)
తెలంగాణ రాష్ట్ర కుమ్మరుల తొలి బోనాల జాతర సందర్భంగా గౌరవ మల్కాజ్‌గిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ ని తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం నాయకులు మర్యాదపూర్వకంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం పెద్దలు, బోనాల ఉత్సవ కమిటీ కన్వీనర్ ఆడాల గణేష్ ఆధ్వర్యంలో ఎంపీ ఈటల రాజేందర్ కి ఆహ్వాన పత్రికను అందజేసి, జాతరకు ముఖ్య అతిథిగా విచ్చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఆహ్వానాన్ని స్వీకరించిన ఎంపీ ఈటల రాజేందర్ కుమ్మరుల తొలి బోనాల జాతర విజయవంతం కావాలని ఆకాంక్షిస్తూ, కుమ్మరుల ఐక్యతకు ప్రతీకగా ఈ వేడుక నిలవాలని అభిలషించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం నాయకులు, ఉత్సవ కమిటీ సభ్యులు, సంఘ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్సిసి క్యాడెట్ల ఎంపిక



**పాపన్నపేట, జూలై 13.( మహాప్రభ )**
మండల కేంద్రమైన పాపన్నపేట ఉన్నత పాఠశాలలో సోమవారం ఎన్సిసి మొదటి సంవత్సరం క్యాడేట్ల ఎంపిక కార్యక్రమం ఎన్సిసి అధికారి శ్రవణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆర్మీ అధికారి సర్వన్ సింగ్ హాజరై విద్యార్థులకు వివిధ రకాల ఈవెంట్స్ నిర్వహించి 53 మంది క్యాడెట్లను ఎంపిక చేశారు. ఈ ఎంపిక కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం మహేశ్వర్, మాజీ ఎన్సిసి అధికారి ప్రవీణ్ కుమార్,భట్టు నాగరాజు తోపాటు పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

## ఓటమి చెందిన బీఆర్ఎస్ సర్పంచ్ అభ్యర్థికి ఆర్థిక సహాయం అందజేత



దేవరకొండ డివిజన్
జూలై 13.(మహాప్రభ)
నేరేడు గుమ్మ మండలం ధర్మ రెక్య తండా బి ఆర్ ఎస్ పార్టీ అభ్యర్థి గా పోటీ చేసి స్వల్ప ఓట్లు తేడాతో ఓటమి పాలైన బి ఆర్ ఎస్.పార్టీ ధర్మ రెక్య తండా నాయకులు ఆదేశానుసారం కొంత మొత్తం ఆర్థిక సాయం అందజేశారు. . స్థానిక సంస్థలు ఎన్నికల్లో తమ సొంత ఆస్తులను అమ్ముకొని పోటీ చేసి స్వల్ప ఓట్ల తేడాతో పర జయం పాలైన అభ్యర్థి ఎన్నికలో తమ స్వంత ఆస్తులను అమ్ముకొని పోటీ చేసి స్వల్ప ఓట్లు తేడాతో చందా నాయక్ తిరిగి తమ జీవనం కొనసాగడం కోసం ఆటో ఇప్పించాలనీ తండా పార్టీ నాయకులు బి ఆర్ ఎస్ పార్టీ పార్టీ దేవరకొండ నియోజవర్గ నాయకులు వద్య రమేష్ గ కోరగా వారిని ఆదుకోవడం. కోసం ఆటో కు అయ్యే దాంట్లో కొంత నగదును ఆయనకు ధర్మ రెక్య తండా బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు తండా ప్రజల చేతుల మీదుగా వారిని ఆదుకోవడం జరిగింది అనంతరం వారిని శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో నేరడగొమ్మ బి ఆర్ ఎస్ మండల పార్టీ మాజీ అధ్యక్షుడు లోకసాని తిరుపతయ్య, ధర్మ రెక్య తండా మాజీ సర్పంచ్ చెన్న నాయక్, పేర్వల మాజీ ఎంపీటీసీ వెంకటయ్య, మాజీ సర్పంచ్ అజ్మపురం రామకృష్ణ, కేతవత్ పుల్ సింగ్ నాయక్, అనిల్, తండా ప్రజలు పాల్గొన్నారు

## నూతనంగా ఎన్నికైన నాయకులకు శుభాకాంక్షలు తెలిపిన డా. దూదిపాల వేణుధర్ రెడ్డి

**గుడిపల్లి మండల పార్టీ అధ్యక్షులుగా నూతనంగా ఎన్నికైన లక్ష్మీనారాయణ**



దేవరకొండ జూలై 13( మహా ప్రభ)
అలాగే జిల్లా కార్యదర్శిగా ఎన్నికైన బాధ్య నాయక్ శాలువాతో ఘనంగా సత్కరించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసిన టి.పి.సి.ఎస్. డెలిగేట్ పి.ఎ..సి.ఎస్. చైర్మన్ డా. దూదిపాల వేణుధర్ రెడ్డి ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు దయాకర్ రెడ్డి , కొండల్ రెడ్డి యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాలకృష్ణ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు. నూతన బాధ్యతలు చేపట్టిన నాయకులు పార్టీ బలోపేతానికి, ప్రజాసేవకు మరింత కృషి చేసి విజయవంతం కావాలని ఆకాంక్షించారు.

## మునగాల కొండలరావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆత్మీయ వీడ్కోలు సమావేశం



**దేవరకొండ జూలై 13( మహాప్రభ )**
మునగాల కొండల్ రావు ప్రభుత్వ డిగ్రీ కళాశాల (స్వ), దేవరకొండలో నాన్ టీచింగ్ విభాగంలో రికార్డ్ అసిస్టెంట్ గా పని చేస్తున్న ఎ.కల్పన ఓడి (ఆన్ డ్యూటీ) మీదా మిర్యాలగూడలోని కే ఎన్ ఎమ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు వెళున్న సందర్భంగా కళాశాలలో ఆత్మీయ వీడ్కోలు సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రామావత్ మాట్లాడుతూ కళాశాలకు సంబంధించి ఏ పనిని అప్పగించిన సమర్థవంతంగా నిర్వహించి కళాశాల అభివృద్ధికి దోహదపడ్డారు అని అన్నారు.ఏ ప్రాంతంలో పనిచేసిన కూడా ఇంతే నియమ నిబద్ధతతో పనిచేయాలని మంచి పేరును పొందాలని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జి.కోటయ్య అకాడమిక్ కోఆర్డినేటర్ సి. లింగమయ్య, ఐ క్యు ఏసి కోఆర్డినేటర్ డా. కె.పృథు, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ జి.లింగారెడ్డి తదితర అధ్యాపకులు అధ్యాపకేదారులు పాల్గొన్నారు

## 21న మండల సర్వసభ్య సమావేశం

**గుంతకల్లు, జూలై 13( మహాప్రభ )**
ఈనెల 21వ తేదీ స్థానిక గుంతకల్లు మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ మాధవి, ఎంపీడీఓ దేవదాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సమావేశానికి జడ్పీటీసీ సభ్యుడు,మండల పరిషత్ ప్రాదేశిక సభ్యులు, గ్రామ సర్పంచులు తప్పకుండా హాజరై సమస్యలను ప్రస్తావించాలని వారు కోరారు.

## శేరిపల్లి బాలరాజు పద్మశాలి ఏకగ్రీవంగ ఏనుకున్న సన్మానించిన శ్రీజాలే నరసింహారెడ్డి



**దేవరకోశీడ డివిజన్ జులై 13 (మహాప్రభ)**
దేవరకొండ పద్మశాలి సంఘానికి ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా బాలరాజు శాలువాతో సత్కరించి అభినందించి శుభాకాంక్షలు తెలిపిన. జాలే నరసింహారెడ్డి పీసీసీసభ్యులు పిఏసిఎస్ చైర్మన్.

ఈ సందర్భంగా నరసింహారెడ్డి మాట్లాడుతూ.బాలరాజు పద్మశాలి సంఘానికి ఏకగ్రీవంగా ఎన్నిక విషయంలో కీలక పాత్ర పోషించిన దేవరకొండ మున్సిపల్ చైర్మన్ పున్న శైలజా వెంకటేశ్వర్లు. అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ పార్వతీ చందు నాయక్, వెంకులు, శ్రీను, శేఖర్, అంజి, తెలుగుపల్లి వెంకటయ్య, మరియు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు ఆధ్వర్యంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ

**-16 మంది అనారోగ్య బాధితులకు రూ. 4.50 లక్షలు**



**రామాయంపేట, జూలై 13 (మహాప్రభ)**
అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు అండగా ఉండేందుకు ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు ఆధ్వర్యంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.రామాయంపేటలో అనారోగ్యంతో ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న 16 మంది లబ్ధిదారులకు మొత్తం రూ. 4 లక్షల 50 వేల రూపాయల విలువైన చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం పేద ప్రజల వైద్యానికి పెద్దపీట వేస్తోందని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా ఆర్థిక సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు.

**కార్యక్రమంలో పాల్గొన్నవారు:**
ఈ కార్యక్రమంలో రామాయంపేట కాంగ్రెస్ అధ్యక్షుడు చింతల స్వామి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు అబ్రబోయిన గంగ రాములు, చింతల యాదగిరి, భూమా కిషన్, ఎర్రం యాదగిరి తదితరులు పాల్గొని లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. లబ్ధిదారులు, వారి కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే రోహిత్ రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

## చికెన్ షాపుల్లో శుభ్రత పాటించాలి

**-రామాయంపేట మున్సిపల్ కమిషనర్**



**రామాయంపేట, జూలై 13 (మహాప్రభ)**
పట్టణంలోని చికెన్ షాపుల్లో పరిశుభ్రత తప్పనిసరిగా పాటించాలని చికెన్ సెంటర్ యజమానులతో సమావేశం మున్సిపల్ కమిషనర్ ఆదేశించారు. ఆహార భద్రత, ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అకస్మాత్తుగా తనిఖీలు నిర్వహించిన కమిషనర్, షాపుల్లో చెత్త, రక్తం, ఈకలు పేరుకుపోకుండా చూసుకోవాలని సూచించారు.

**కమిషనర్ ఆదేశాలు:**
1. ప్రతిరోజూ షాపులు, కత్తులు, టేబుళ్లు శుభ్రం చేయాలి
2. చెత్తను మూతలున్న డస్ట్ బిన్‌లలోనే వేయాలి
3. విక్రయదారులు ఆప్రాన్, చేతి తొడుగులు, తలకు క్యాప్ ధరించాలి
4. మురుగు నీరు రోడ్డుపైకి పారకుండా డ్రైనేజీకి కలపాలి
5. ఫుడ్ లైసెన్స్, ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరిగా ప్రదర్శించాలి

నిబంధనలు ఉల్లంఘించిన షాపులపై జరిమానా విధిస్తామని, అవసరమైతే షాపులు సీజ్ చేస్తామని కమిషనర్ హెచ్చరించారు.
ప్రజలు కూడా శుభ్రంగా లేని చోట చికెన్ కొనవద్దని, ఏవైనా ఫిర్యాదులు ఉంటే మున్సిపల్ ఆఫీసులో తెలియజేయాలని కోరారు.

## తూప్రాన్‌లో కిరాణా దుకాణంలో అగ్నిప్రమాదం

**-షార్ట్ సర్క్యూట్ కారణమై ఉండొచ్చని అనుమానం**

**-భారీగా ఆస్తి నష్టం**




**తూప్రాన్, జూలై 13. (మహాప్రభ)**
తూప్రాన్ పట్టణంలోని సుష్మ హాస్పిటల్ సమీపంలో ఉన్న శ్రీ మల్లికార్జున స్వామి కిరాణా దుకాణంలో సోమవారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. ఆకస్మికంగా మంటలు చెలరేగడంతో దుకాణంలోని సామగ్రి మంటలకు ఆహుతైంది. ఈ ఘటనలో భారీగా ఆస్తి నష్టం సంభవించినట్లు ప్రాథమిక సమాచారం. సమాచారం అందుకున్న స్థానికులు వెంటనే అప్రమత్తమై మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించారు. అనంతరం అగ్నిమాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను పూర్తిగా అదుపులోకి తీసుకువచ్చారు. ఘటన జరిగిన సమయంలో దుకాణ యజమాని కొమరవెల్లి మల్లికార్జున స్వామి దర్శనానికి వెళ్లినట్లు తెలిసింది. షార్ట్ సర్క్యూట్ కారణంగానే అగ్నిప్రమాదం జరిగి ఉండొచ్చని స్థానికులు అనుమానిస్తున్నారు. ప్రమాదానికి గల ఖచ్చితమైన కారణాలు, జరిగిన ఆస్తి నష్టంపై అధికారులు విచారణ చేపట్టారు.

# యాదాద్రి భువనగిరి జిల్లా టీ ఆర్ కె ఎస్ కార్యవర్గ సమావేశం ఘనంగా.

**జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తాడూరి వెంకటేష్, గౌరవ సలహాదారుగా గంగాధరి జంగయ్య ఎన్నిక తొలి బోనాల జాతర కరపత్రం ఆవిష్కరణ**



**యాదాద్రి భువనగిరి - జూలై 12 (మహప్రభ)**
యాదాద్రి భువనగిరి జిల్లా కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం టీ ఆర్ కే ఎస్ జిల్లా అధ్యక్షులు ఓరుగంటి గోపాల్ అధ్యక్షతన జిల్లా కార్యవర్గ సమావేశం ఘనంగా నిర్వహించారు. ఇటీవల అనారోగ్యానికి గురైన జిల్లా అధ్యక్షులు ఓరుగంటి గోపాల్ ని రాష్ట్ర, జిల్లా నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి, వారి ఆరోగ్యం త్వరగా చేకూరాలని ఆకాంక్షించారు. జిల్లా అధ్యక్షులు ఆరోగ్య కారణాల వల్ల జిల్లా, రాష్ట్ర కార్యక్రమాల్లో పూర్తిస్థాయిలో పాల్గొనలేని పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని, జిల్లా కమిటీలో చురుకుగా పనిచేస్తున్న జిల్లా అసోసియేట్ అధ్యక్షులు తాడూరి వెంకటేష్ ని యాదాద్రి భువనగిరి జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా జిల్లా కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకుంది. అదేవిధంగా సంఘంలో సుదీర్ఘకాలంగా సేవలందిస్తూ సీనియర్ నాయకుడిగా గుర్తింపు పొందిన వృత్తిదారుల విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంగాధరి జంగయ్య ని జిల్లా గౌరవ సలహాదారుగా జిల్లా కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకుంది. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తాడూరి వెంకటేష్ కి, జిల్లా గౌరవ సలహాదారుగా ఎన్నికైన గంగాధరి జంగయ్య కి రాష్ట్ర, జిల్లా నాయకులు ఘనంగా సన్మానం చేసి అభినందనలు తెలిపారు. అనంతరం, జూలై 16, 2026న హైదరాబాద్ లోయర్ ట్యాంక్ బండ్‌లోని శ్రీ శ్రీ శ్రీ కనకాల కట్ట మైసమ్మ తల్లి దేవాలయం ప్రాంగణంలో తెలంగాణ రాష్ట్ర కుమ్మర సంఘం టీ ఆర్ కె ఎస్ రాష్ట్ర అధ్యక్షులు నడికుడ జయంత్ రావు నాయకత్వంలో నిర్వహించనున్న తొలి బోనాల జాతర కరపత్రాన్ని జిల్లా కార్యవర్గ సభ్యులు ఆవిష్కరించారు. ఈ మహోత్సవానికి యాదాద్రి భువనగిరి జిల్లా నుంచి పెద్ద ఎత్తున కుమ్మర కులస్తులు హాజరై విజయవంతం చేస్తామని నాయకులు తెలిపారు. ఈ సమావేశంలో టీ ఆర్ కె ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఏడుకొండల వెంకటేశమ్, రాష్ట్ర వృత్తిదారుల విభాగం ప్రధాన కార్యదర్శి గంగాధరి జంగయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి దరిపల్లి ప్రవీణ్ కుమార్, జిల్లా కోశాధికారి తాడూరి ఆంజనేయులు, గౌరవ సలహాదారులు గంగాధరి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులు దొమ్మాటి మహేష్, దేవరుప్పాల మల్లేశం, ములుగు నర్సింహా, తాడూరి బాలశంకర్, జిల్లా వృత్తిదారుల విభాగం అధ్యక్షులు చినగారి కృష్ణ, ప్రచార కార్యదర్శి గుమ్మాడెల్లి భాస్కర్, లీగల్ సెల్ తాడూరి బాలమల్లయ్య, సహాయ కార్యదర్శి చెనగరం పాండు, జిల్లా కార్యవర్గ సభ్యులు చేనిగరం నర్సింహా, తూర్కపల్లి మండల అధ్యక్షులు దేవరుప్పాల ఐలయ్య, ప్రధాన కార్యదర్శి నాగాయపల్లి శివరాములు తదితరులు పాల్గొన్నారు

# నులిపురుగుల నిర్మూలన తోనే బాలల ఆరోగ్యం కలెక్టర్

**-పిల్లల్లో నులిపురుగుల వ్యాప్తిని నిరోధించడానికి తల్లిదండ్రులు సహకరించాలి**

**-మాత్రలు వేసుకోవడం వల్ల ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవు.**




**మెదక్ జిల్లా -13జూలై (మహాప్రభ )**
తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల మరియు జూనియర్ కళాశాలలో నులిపురుగుల నివారణ దినోత్సవ కార్యక్రమాన్ని కలెక్టర్ ప్రతిమా సింగ్ ప్రారంభించారు. నులిపురుగుల నివారణతోనే బాలల ఆరోగ్యం సొంతమవుతుందని కలెక్టర్ ప్రతిమాసింగ్ అన్నారు. సోమవారం మెదక్ జిల్లా కేంద్రంలోని తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ పాఠశాల మరియు జూనియర్ కళాశాలలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో చేపట్టిన జాతీయ నులి పురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మున్సిపల్ చైర్మన్ రాధిక భూపతి రాజు, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గణేష్ వర్ ప్రజా ప్రతినిధులు పాఠశాల కళాశాల ప్రిన్సిపాల్ తో కలిసి బాలికలకు ఆల్బెండజోల్ మాత్రల స్వయంగా కలెక్టర్ వేయడం జరిగింది.

ఈ సంధర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, చేతుల శుభ్రత వల్ల అనేక వ్యాధులను నివారించవచ్చుని, భోజనానికి ముందు , వాష్ రూంకు వెళ్ళిన తర్వాత తప్పక చేతులు సబ్బుతో కడుక్కోవాలని, మంచి అలవాట్లవల్ల ఆరోగ్యంగా వుంటామని, పిల్లలు మట్టిలో ఆడుకోవడం వల్ల నులిపురుగుల గుడ్లు చేతుల ద్వారా కడుపులోకి చేరి అక్కడ నులిపురుగులు ఏర్పడి తినే ఆహారం నేరుగా నులిపురుగులను చేరడం వల్ల పిల్లల్లో బలహీనత, రక్తహీనత, పోషకాహారలోపం, కడుపునొప్పి, వాంతులు, విరేచనాలు అవుతాయి కాబట్టిబొక్క అల్బెండజోల్ టాబ్లెట్ వల్ల పిల్లల్లో శారీరక శక్తి , మానసిక అభివృద్ధి పెరుగుతుంది, ఆట,పాట, చదువుల్లో చురుగ్గా వుంటారు కాబట్టి తప్పక అల్బెండ జోల్ టాబ్లెట్ అందరూ తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు .మునిసిపల్ చైర్ పర్సన్ రాధిక భూపతిరాజు మాట్లాడుతూ ఆరోగ్యంగా వున్న పిల్లల్ని చూస్తే చాలా సంతోషం కలుగుతుందని, రాష్ట్ర ప్రభుత్వం ఈరోజు జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం సందర్భంగా 1 నుండి 19 సంవత్సరాల లోపు వున్న పిల్లలందరికీ అల్బెండజోల్ టాబ్లెట్లను ఉచితంగా విద్యార్థినులకు వేస్తున్నారని , ఈ టాబ్లెట్స్ ఎదుగుతున్న పిల్లలకు తప్పనిసరి అవసరం అని, పిల్లల్లో నులిపురుగుల వల్ల ఏర్పడే రుగ్మతలను ఈ టాబ్లెట్ నివారిస్తుందని, పిల్లలు తప్పనిసరిగా పాదరక్షలు వాడాలని, గోర్లు చిన్నవిగా ఉంచుకోవాలని, పండ్లు శుభ్రమైన నీటితో కడిగి తినాలని, ఆరోగ్యంతో పాటు , వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని, ఈ టాబ్లెట్ అందరూ వేసుకోవాలని, రక్త హీనత , కడుపునొప్పి లేకుండా వుంటుందని, ఆకలి మంచిగా అవుతుందని, పిల్లల ఆరోగ్యమే సమాజానికి వారం అని తెలిపారు.

జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా.గణేశ్వర్ మాట్లాడుతూ అల్బెండజోల్ టాబ్లెట్ వల్ల పిల్లలకు ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ ఉండవని, అందుబాటులో నిపుణులైన పిల్లల వైద్యులు సేవలు అందిస్తున్నారని, ఆరోజు మాత్రలు వేసుకోని పిల్లలకు తేది : 20.07.2026 నాడు మాపప్ కార్యక్రమం నిర్వహిస్తామని ఈ రోజు జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, అంగన్వాడి టీచర్లు , ఆశ కార్యకర్తలు పాఠశాలల్లో పిల్లలకు అల్బెండజోల్ టాబ్లెట్లు వేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్మ్యునైజేషన్ అధికారి డా.జయశ్రీ, మాస్ మీడియా అధికారి అన్వర్, మెడికల్ ఆఫీసర్ డా.సాయి గౌతం, సి.హెచ్.ఓ. ప్రదీప్ ,పి.హెచ్. లిల్లీ గ్రేస్, రిటైర్డ్ హెచ్.ఈ.వో. రమేష్, సిస్టర్ మేరీ , సునీత ,ల్యాబ్ టెక్నీషియన్ వంశిధర్ రెడ్డి, రమేష్, పాఠశాల హెడ్ మాస్టర్, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# ఆభరణాల కోసం మహిళ హత్య.. నిందితుడికి జీవిత ఖైదు, రూ.25 వేల జరిమానా.

**-ఒంటరి మహిళలనే లక్ష్యంగా చేసుకున్న హంతకుడికి యావజ్జీవ కారాగార శిక్ష.**

**-నిందితుడికి శిక్ష పడడంలో కృషి చేసిన దర్యాప్తు అధికారులు, పోలీసు సిబ్బందిని అభినందించిన జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్.**




**మెదక్ జిల్లా -13జూలై (మహాప్రభ )**
ఒంటరిగా సంచరించే మహిళలను లక్ష్యంగా చేసుకుని ఆభరణాల కోసం దారుణ హత్యకు పాల్పడిన నిందితుడికి జిల్లా న్యాయస్థానం జీవిత ఖైదుతో పాటు రూ.25 వేల జరిమానా విధించినట్లు జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ తెలిపారు.ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం.. నర్సాపూర్ పట్టణానికి వచ్చిన బుజలి అనే మహిళతో కేతావత్ గోపాల్ అనే వ్యక్తి పరిచయం పెంచుకుని నమ్మకం కల్పించాడు. అనంతరం ఆమెను ఆటోలో శ్రీనివాస వైన్స్‌కు తీసుకెళ్లి మద్యం కొనుగోలు చేశాడు. అక్కడి నుంచి నర్సాపూర్ శివారులో ఆటో దిగి సమీప అటవీ ప్రాంతానికి తీసుకెళ్లి మద్యం సేవించాడు. మహిళ మెడలో ఉన్న బంగారు ఆభరణాలపై కన్నేసిన నిందితుడు వాటిని దోచుకోవాలనే ఉద్దేశంతో ఆమెను హత్య చేసి అక్కడి నుంచి పరారయ్యాడు.

మహిళ ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు 25-03-2025న నర్సాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అప్పటి ఎస్ఐ లింగం మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీటీవీ ఫుటేజీలను పరిశీలించిన పోలీసులు మహిళతో కలిసి వెళ్లిన ఆటోను గుర్తించారు. ఆటో డ్రైవర్‌ను విచారించగా, అతడు వారిని దించిన ప్రాంతాన్ని చూపించాడు. అక్కడ అటవీ ప్రాంతంలో గాలింపు చేపట్టిన పోలీసులు కుళ్లిన స్థితిలో ఉన్న మహిళ మృతదేహాన్ని గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

అనంతరం కేసును హత్య కేసుగా మార్చి దర్యాప్తును వేగవంతం చేశారు. అప్పటి నర్సాపూర్ సీఐ జాన్‌రెడ్డి శాస్త్రీయ, సాంకేతిక ఆధారాలను సేకరించి నిందితుడిని అరెస్టు చేసి పక్కా ఛార్జ్‌షీట్ దాఖలు చేశారు. కేసు విచారణ సందర్భంగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేష్ సమర్థవంతంగా వాదనలు వినిపించారు. కేసులో సమర్పించిన సాక్ష్యాధారాలు, సాక్షుల వాంగ్మూలాలను సమగ్రంగా పరిశీలించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి నీలిమ, నిందితుడు కేతావత్ గోపాల్‌పై నేరం రుజువైందని నిర్ధారించి, అతనికి జీవిత ఖైదుతో పాటు రూ.25 వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు.ఈ కేసు దర్యాప్తులో లైజనింగ్ అధికారి ఎస్ఐ విఠల్, కానిస్టేబుల్ రవీందర్ గౌడ్, సీడీఓ హరిబాబు గౌడ్ సహకరించారు. నిందితుడికి శిక్ష పడేలా పక్కా ఆధారాలు సేకరించి సమర్థవంతంగా దర్యాప్తు నిర్వహించిన అప్పటి దర్యాప్తు అధికారి సీఐ జాన్‌రెడ్డి, పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేష్, లైజనింగ్ బృందం, దర్యాప్తులో పాల్గొన్న పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు అభినందించారు.

# బిజినెస్

## రోజంతా ఒడిదొడుకులు..

**చివరికి ఫ్లాట్‌గా ముగిసిన మార్కెట్లు**




దేశీయ స్టాక్ మార్కెట్లు ఇవాళ ట్రేడింగ్ ను స్వల్ప లాభాలతో ముగించాయి. రోజంతా తీవ్ర ఒడిదొడుకులకు లోనైన సూచీలు.. చివరి గంటలో ఐటీ షేర్లలో వచ్చిన కొనుగోళ్ల మద్దతుతో నష్టాల నుంచి బయటపడి ఫ్లాట్‌గా ముగిశాయి. ఎఫ్‌ఎంసీజీ, మెటల్ రంగాల షేర్లలో అమ్మకాల ఒత్తిడి ఉన్నప్పటికీ, ఐటీ రంగం మార్కెట్లను నిలబెట్టింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి బీఎస్ఈ సెన్సెక్స్ (దీూజు ావఅంవఞ) 47.01 పాయింట్లు లాభపడి 77,616.40 వద్ద స్థిరపడింది.అదేవిధంగా ఎన్ఎస్ఈ నిఫ్టీ 4.10 పాయింట్లు మాత్రమే పెరిగి 24,211 వద్ద నిలిచింది. రోజు మధ్యలో సూచీలు నష్టాల్లోకి జారుకున్నప్పటికీ చివరి సెషన్‌లో పుంజుకోవడం గమనార్హం. ఇవాళ్టి ట్రేడింగ్‌లో ఐటీ రంగం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్, టెక్ మహీంద్రా వంటి అగ్రశ్రేణి ఐటీ కంపెనీల షేర్లు నిఫ్టీలో టాప్ గెయినర్స్‌గా నిలిచాయి. దాంతో నిఫ్టీ ఐటీ ఇండెక్స్ మిగిలిన రంగాల కంటే మెరుగైన పనితీరు కనబరిచింది. దీనికి విరుద్ధంగా నిఫ్టీ ఎఫ్‌ఎంసీజీ, నిఫ్టీ మెటల్ సూచీలు అమ్మకాల ఒత్తిడితో నష్టపోయాయి. బ్రాడర్ మార్కెట్‌లోనూ సానుకూల వాతావరణం కనిపించింది. నిఫ్టీ మిడ్‌క్యాప్ ఇండెక్స్ 0.01 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 0.03 శాతం స్వల్ప లాభాలతో ముగిశాయి. ఇదిలావుంటే కరెన్సీ మార్కెట్‌లో రూపాయి విలువ భారీగా క్షీణించింది. అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు 4 శాతానికిపైగా పెరగడంతో భారత్ దిగుమతుల బిల్లుపై ఆందోళనలు పెరిగాయి. ఫలితంగా డాలర్‌తో రూపాయి మారకం విలువ 0.26 శాతం బలహీనపడి 95.60 వద్ద ట్రేడయ్యింది.

## మరో రెండు నెలల్లో 18 ప్రో, 18 ప్రో మ్యాక్స్.. ధర, సరికొత్త ఫీచర్లు ఇవే..!

యాపిల్ నుంచి ఐఫోన్ కొత్త వెర్షన్ కోసం ఎదురుచూస్తున్న యూజర్లకు గుడ్‌న్యూస్. ఐఫోన్ 18 ప్రో, 18 ప్రో మ్యాక్స్ వేరియంట్స్ మరో రెండు నెలల్లో మార్కోట్లోకి రానున్నాయి. వచ్చే సెప్టెంబర్‌లో భారత వినియోగదారులకు ఈ ఫోన్లు అందుబాటులోకి తేవాలని యాపిల్ భావిస్తోంది. ఇండియాలో ఈ రకం ధర, ఫీచర్లు ఆకర్షణీయంగా ఉండనున్నాయి. ఐఫోన్ 18 కంటే కెమెరాను 18 ప్రోలో, 18 ప్రో మ్యాక్స్‌లో కెమెరా మరింత మెరుగ్గా ఉండనుంది.కొత్తగా రాబోతున్న ఐఫోన్ 18 ప్రో, 18 ప్రో మ్యాక్స్‌లో ప్రత్యేక ఫీచర్లతో వస్తున్నాయి. వీటిలో బ్యాటరీ మరింత పెద్దగా ఉండనుంది. అలానే సరికొత్త ఏ20 ప్రో చిప్‌తో కూడిన కెమెరా అప్డేట్ ఉంటుంది. ఇవే కాకుండా.. ఆకర్షణీయమైన రంగులు, ఆకట్టుకునే డిజైన్లలో ఈ రెండు వేరియంట్లు రాబోతున్నాయి. అయితే.. కొత్తదనం కోరుకుంటున్న యూజర్లకు షాకిస్తూ.. ఫ్లాట్ ఎడ్జ్, ట్రిపుల్ కెమెరాతోనే ఈ వేరియంట్లు ఉండనున్నాయి. 18 ప్రో మోడల్ మునపటికంటే కాస్త మందంగా ఉంటుందని సమాచారం. దాంతో, పెద్ద బ్యాటరీలు.. వేపర్ కూలింగ్ సిస్టమ్ ఏర్పాటుకు అనువుగా మారనుంది. బ్యాటరీ మన్నిక కోసం వీటిలో



ఎల్టీపీఓ ప్లస్ ఒలెడ్ డిస్ ప్లేకు రూపమిస్తున్నారని టాక్. 18 ప్రో మ్యాక్స్ బ్యాటరీ సామర్థ్యం 5,391ఎంఏహ్ నుంచి.. 5,500ఎంఏహెచ్ ఉంటుంది. రంగుల విషయానికొస్తే.. ముదురు చెర్రీ పండు కలర్‌తో పాటు లేత నీలం, వెండి.. ముదురు ఊదా రంగుల్లో ఉంటాయని చెబుతున్నారు. ఇక డిస్ ప్లే సంగతి చూస్తే.. 18 ప్రో 6.3 ఇంచులు, 18 ప్రో మ్యాక్స్ 6.9 ఇంచులతో ఉండడం ఖాయం. ఏఐ, సాఫ్ట్‌వేర్ వివరాల్లోకి వస్తే.. 18 ప్రోలో ఏఓఎస్ 27తో పాటు 'సిరి', ఆత్యాధునిక ఏఐ ఫీచర్లు పొందుపరచనున్నారు. 18 ప్రో ధర రూ. 1,39,900 నుంచి ఉండనుండగా.. 18 ప్రో మ్యాక్స్ ధర రూ.1,54,900 నుంచి మొదలవ్వనుంది. బ్లూంబర్గ్స్ మార్క్ గుర్మన్ కథనం ప్రకారం.. సెప్టెంబర్ 8 మంగళవారం రోజున లాంఛ్ చేయాలని యాపిల్ అనుకుంటోంది. లేదంటే సెప్టెంబర్ 9 బుధవారం ఈ రెండు వేరియంట్లు భారత మార్కెట్లో అందుబాటులో ఉండే అవకాశముంది. అయితే.. అంతర్జాతీయ మీడియాకు సమాచారం ఇవ్వాలనే ఉద్దేశంతో సెప్టెంబర్ 9వ తేదీని ఖరారు చేస్తారని వినికిడి. సెప్టెంబర్ 18 నుంచి రిటైల్ స్టోర్లలో అమ్మకాలు మొదలవుతాయని గుర్మన్ పేర్కొంది.

## స్వల్పంగా తగ్గిన బంగారం, వెండి ధరలు..

**-10 గ్రాముల 24 క్యారెట్ బంగారం ధర ఎంతంటే..!**

భారత మార్కెట్‌లో సోమవారం ఉదయం బంగారం ధరలు స్వల్పంగా తగ్గుముఖం పట్టాయి. అంతర్జాతీయ మార్కెట్‌లోని బలహీన సంకేతాలకు తోడు, దేశీయంగా డిమాండ్ తగ్గడం బంగారం ధరల్లో ఈ మార్పునకు కారణమైంది. తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలైన హైదరాబాద్ (ఎఎవతీఝఝ), విజయవాడ లలో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,44,320 వద్ద ట్రేడవుతోంది.మార్కెట్ వర్గాల సమాచారం ప్రకారం.. 22 క్యారెట్ల ఆభరణాల బంగారం ధర 10 గ్రాములకు రూ.1,32,290 గా నమోదైంది. అదేవిధంగా 18 క్యారెట్ల బంగారం రూ.1,08,240 వద్ద కొనసాగుతోంది. పసిడి బాటలోనే వెండి ధర కూడా స్వల్పంగా తగ్గింది.



ప్రస్తుతం మార్కెట్‌లో కిలో వెండి ధర రూ.2,39,900 సమీపంలో కొనసాగుతున్నది. దేశంలోని ఇతర ప్రధాన నగరాల్లోనూ బంగారం ధరల్లో స్వల్ప వ్యత్యాసాలు ఉన్నాయి. తమిళనాడు రాజధాని చెన్నైలో 24 క్యారెట్ల బంగారం ధర సుమారు రూ.1,45,080 గా ఉండగా.. ముంబై, బెంగళూరు, కోల్‌కతా వంటి నగరాల్లో దాదాపుగా తెలుగు రాష్ట్రాల్లోని ధరలే అమలవుతున్నాయి. అయితే బంగారం కొనుగోలు చేసే సమయంలో జీఎస్టీ, తయారీ ఛార్జీలు అదనంగా ఉంటాయని, అందువల్ల స్థానిక నగల దుకాణాల్లో ఖచ్చితమైన ధరలను సరిచూసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు.

# స్పోర్ట్స్

## క్రికెట్ పుట్టింట్లో గెలిచిన అమ్మాయిలు..

**-పట్టుదలకు ప్రతీక లార్డ్స్ విజయం..!**

వన్డే వరల్డ్‌కప్ ఛాంపియన్‌గా చిరకాల కలను సాకారం చేసుకున్న భారత మహిళల జట్టు లార్డ్స్ లో చెలరేగిపోయింది. క్రికెట్ పుట్టినిల్లు ఇంగ్లండ్‌లో చిరస్మరణీయ విజయంతో అమ్మాయిలు తక్కువేమీ కాదని నిరూపించింది హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం. 'క్రికెట్ మక్కా' లార్డ్స్‌లో 142 ఏళ్లకు జరిగిన మొట్టమొదటి మహిళల టెస్టులో సంపూర్ణ అధిపత్యంతో ఇంగ్లండ్‌ను చిత్తు చేసింది. టీ20 ప్రపంచకప్‌లో లీగ్ దశలో వెనుదిరిగినందున.. ఐకైక టెస్టులో విజయంతో ఊరట చెందుతాం అని పేర్కొన్న హర్మన్‌ప్రీత్ అనుకున్నంత పని చేసి చూపింది. ఈ సంచలన విక్టరీ క్రెడిట్ క్రాంతి, యస్తిక, మంధానకే కాదు.. జట్టులోని ప్రతిఒక్కరికి దక్కుతుంది. శ్రేయాస్ అయ్యర్ సేన చతికిలపడిందనే బాధను పోగొట్టిన అమ్మాయిలను చూసి పాఠాలు నేర్వాల్సిందే.విదేశీ పర్యటనల్లో విజయం చిన్న విషయమేమి కాదు. ఆతిథ్య జట్టుకు కొట్టినపిండి లాంటి పరిస్థితుల నడమ అవకాశాలు సృష్టించుకుంటేనే గెలుపు తలుపు తట్టగలం. అది సాధ్యమవ్వాలంటే జట్టు కూర్పుతో పాటు ఓపెనర్ల నుంచి శుభారంభం లభించడం ముఖ్యం. లార్డ్స్ టెస్టులో భారత జట్టు అదే చేసి చూపింది. వైస్ కెప్టెన్ స్మృతి మంధాన(83, 70) రెండు ఇన్నింగ్స్‌ల్లో అర్ధ శతకాలతో ఇంగ్లండ్ బౌలర్ల ఆత్మస్థయిర్యాన్ని దెబ్బతీసి.. తర్వాతి బ్యాటర్లపై ఒత్తిడి తగ్గించింది.ఓపెనర్ షఫాలీ వర్మ(0), జెమీమా



రోడ్రిగ్స్(35) విఫలమైనా.. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్(58), దీప్తి శర్మ(57)లు ఎప్పటిలానే కీలక ఇన్నింగ్స్ ఆడి తొలి ఇన్నింగ్స్‌లో భారీ స్కోరందించారు. అనంతరం బౌలింగ్ దళంలోని 22 ఏళ్ల క్రాంతి గౌడ్(5-37) సంచలన స్పెల్‌తో రెండో రోజే మ్యాచ్ భారత జట్టు చేతుల్లోకి వచ్చేసింది. మరో ఎండ్‌లో సయాలీ సత్ఘరే(2-40) వికెట్ల వేటతో విరుచుకుపడగా ఆతిథ్య జట్టు 170కే కుప్పకూలింది. 115 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యంతో మ్యాచ్‌పై పట్టుబిగించిన భారత్.. ఇంగ్లండ్‌కు పుంజుకునే అవకాశమే ఇవ్వలేదు.

**మంధాన సలహాలతో..**

కెరీర్ ఆరంభం నుంచి గాయాలతో జట్టులోకి వస్తూ పోతున్న యస్తికా భాటియా(113) తన విలువేంటో చాటుకుంది. స్మృతి మంధాన సలహాలతో ఆత్మవిశ్వాసం కూడదీసుకున్న ఈ డాషింగ్ బ్యాటర్.. రెండో ఇన్నింగ్స్‌లో శతకంతో ఆధిక్యాన్ని మూడొందలు దాటించింది. యస్తికా ఔటైనా.. రీచా ఘోష్(50 నాటౌట్) మెరుపు షాట్లతో అలరించింది. 341/7వద్ద ఇన్నింగ్స్ డిక్లేర్ చేసిన భారత్ అదే క్రమశిక్షణను చూపింది.

తొలి ఇన్నింగ్స్‌లో ఐదు వికెట్లతో 'లార్డ్స్ హానర్స్ బోర్డు'లో పేరు సంపాదించిన తొలి మహిళా క్రికెటర్‌గా రికార్డు నెలకొల్పిన క్రాంతి గౌండ్.. మళ్లీ వేటాడింది. అంతర్జాతీయ క్రికెట్‌ను ఘనంగా ముగించాలనుకున్న ఓపెనర్ టమ్మీ బ్యూమంట్(0), వెటరన్ హీథర్ నైట్(13)లను డగౌట్ చేర్చిందీ స్పీడ్‌స్టర్. అనంతరం.. సయలీ(2-24) జోరు చూపగా.. స్నేహ్ రాణా(4-42), దీప్తి శర్మ(2-36)లు తిప్పేయడంతో హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం చరిత్రాత్మక విజయం సాధించింది. ఇంగ్లండ్‌పై తమ ఆధిపత్యాన్ని నిరూపిస్తూ పదకొండుకు 11 విక్టరీలతో సత్తా చాటింది టీమిండియా.

**విజయాల బాటలో..**

1. 1976-1999 మధ్య 26 మ్యాచుల్లో ఒకేఒక విజయం.. ఐదు ఓటములు, 20 మ్యాచ్‌లు డ్రా.
2. 2002-2006 మధ్య పరిస్థితిలో మార్పు వచ్చింది. 8 మ్యాచుల్లో రెండు విజయాలు.. ఒకే పరాజయం.. ఐదు డ్రా.
3. 2014 నుంచి ప్రస్తుతం.. 9 మ్యాచుల్లో 6 విజయాలు.. ఒక ఓటమి.. రెండు డ్రా

భారీ విజయం మాత్రం ఇంగ్లండ్‌పైనే. 2023లో డీవై పాటిల్ స్టేడియంలో 347 పరుగుల తేడాతో భారత్ జయభేరి మోగించింది.

## ఏడాదిగా ఎదురుచూపు..

**వెస్టిండీస్ స్క్వాడ్‌లో విధ్వంసక వీరుడు..!**



విధ్వంసక క్రికెటర్ షిమ్రన్ హిట్‌మైర్ కల ఫలించింది. వన్డేల్లో అవకాశం కోసం ఏడాదికిపైగా ఎదురుచూస్తున్న ఈ లెఫ్ట్ హ్యాండర్ వెస్టిండీస్ స్క్వాడ్‌లోకి వచ్చేశాడు. న్యూజిలాండ్‌తో జరుగుతున్న వన్డే సిరీస్‌లో గాయపడిన జస్టిన్ గ్రీవ్స్ స్థానంలో ఈ చిచ్చరపిడుగును ఎంపిక చేశారు. తొలి మ్యాచ్‌లో వెన్ను గాయంతో బాధపడిన గ్రీవ్స్.. తదుపరి రెండు మ్యాచ్‌లకు దూరమయ్యాడు. దాంతో, దూకుడుగా ఆడగల హిట్‌మైర్‌కు అతడి బదులు తీసుకున్నారు.వెస్టిండీస్ బ్యాటింగ్ యూనిట్‌లో కీలకమైన షిమ్రన్ హిట్‌మైర్ నిరుడు జూన్‌లో చివరిసారి వన్డే జెర్సీ ధరించాడు.శ్రీలంకతో వన్డే సిరీస్‌కు ఎంపికైనప్పటికీ అతడికి తుదిజట్టులో అవకాశం రాలేదు. ఈసారి న్యూజిలాండ్‌తో వన్డేల కోసం సంప్రదించగా మేజర్ లీగ్ క్రికెట్(మీూజ)లో ఆడుతున్నట్టు చెప్పాడు. అయితే.. అతడు ప్రాతినిధ్యం వహిస్తున్న సియాటెల్ ఒర్కాస్(ూమఝశ్రీవ ూతీఝం) జట్టు ఐదో స్థానంతో.. నాకౌట్‌కు అర్హత సాధించలేదు. దాంతో.. ఖాళీగానే ఉన్న హెట్‌మైర్‌ను గాయపడిన గ్రేవ్స్ స్థానంలో స్క్వాడ్‌లోకి తీసుకున్నారు సెలెక్టర్లు.

వెస్టిండీస్ స్క్వాడ్ (తొలి మూడు వన్డేలకు) : షాయ్ హోప్(కెప్టెన్), అకీమ్ ఆగస్టే, జాన్ క్యాంప్‌బెల్, కేసీ కార్టీ, రోస్టన్ ఛేజ్, మాథ్యూ ఫోర్డే, షిమ్రన్ హిట్‌మైర్, అమిర్ జన్గూ, అల్జారీ జోసెఫ్, షమర్ జోసెఫ్, విటెల్ లావెస్, గుడకేశ్ మోతీ, కీమో పాల్, రూథర్‌ఫోర్డ్, జైడెన్ సీల్స్.

## 18 ఏళ్ల బంధానికి బ్రేక్..

**- చెన్నై సూపర్‌కింగ్స్ కోచ్ పదవి నుంచి తప్పుకున్న స్టీఫెన్ ఫ్లెమింగ్**

**న్యూఢిల్లీ:**
18 ఏళ్ల బంధానికి బ్రేక్ పడింది. ఐపీఎల్ ఫ్రాంచైజీ చెన్నై సూపర్ కింగ్స్ కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ .. ఆ జట్టు కోచింగ్ బాధ్యతల నుంచి తప్పుకున్నారు. సీఎస్కే, ఫ్లెమింగ్ విడిపోయినట్లు తెలిసింది. అయితే కొత్త వ్యక్తితో కోచింగ్ బాధ్యతలు నిర్వర్తించే ఆలోచనలో సీఎస్కే ఉన్నట్లు ఓ కథనం ద్వారా తెలిసింది. చెన్నై జట్టు హెడ్‌కోచ్ పదవి కోసం మాజీ టీమిండియా క్రికెటర్ హేమంగ్ బదానీ రేసులో ఉన్నట్లు తేలింది. ప్రస్తుతం చెన్నై ఫ్రాంచైజీ పెద్దలు అంతా డల్లాస్‌లో ఉన్నారు. అమెరికాలో జరుగుతున్న క్రికెట్ లీగ్‌లో టెక్సాస్ సూపర్ కింగ్స్ తరపున ప్రమోషన్ చేస్తున్నారు.అయితే అమెరికా టోర్నీలో టెక్సారస్ జట్టు పేలవ ప్రదర్శన ఇచ్చింది. 10 మ్యాచుల్లో కేవలం 3 మ్యాచ్‌లే ఆ జట్టు నెగ్గింది. ఆ డల్లాస్ జట్టుకు కూడా



స్టీఫెన్ ఫ్లెమింగ్ కోచ్‌గా ఉన్నారు. కొత్త కోచింగ్ సిబ్బందికి చెందిన చర్చలు జరుగుతున్నాయని, తర్వలోనే దీనిపై తుది నిర్ణయం తీసుకుంటామని సీఎస్కేసీఎల్ డైరెక్టర్ రూపా గురునాథ్ తెలిపారు. తమ కోచింగ్ బృందంలో స్టీఫెన్ ఫ్లెమింగ్ కీలకంగా వ్యవహరించారని, రెండు దశాబ్దాల పాటు జట్టుకు గుర్తింపు తెచ్చారని, ఓ విజన్ తో వ్యవహరించారని, జట్టును మెరుగ్గా తీర్చిదిద్దారని రూపా తెలిపారు. ప్రస్తుతం ఢిల్లీ క్యాపిటల్స్ కోచ్‌గా ఉన్న హేమాంగ్ బదానీతో సంప్రదింపులు జరుగుతున్నట్లు సీఎస్కే ప్రతినిధులు తెలిపారు. చెన్నై కోచింగ్ బృందంలో బదానీ చేరే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. 2008లో ప్లేయర్‌గా ఫ్లెమింగ్ జట్టులో చేరాడు. ఆ తర్వాత 2009 నుంచి కోచింగ్ బృందంలో చేశాడు. 2016, 2017 సంవత్సరాల్లో చెన్నై జట్టుపై సస్పెన్షన్ విధజంచారు. ఆ సమయంలో అతను పూణె జట్టుకు కోచ్‌గా చేశారు. 2017లో పూణె జట్టు ఫైనల్లోకి ప్రవేశించింది. కోచ్‌గా ఫ్లెమింగ్ ఉన్న సమయంలో చెన్నై జట్టు 11 సార్లు ఫైనల్స్‌లోకి ప్రవేశించింది,. 10 సార్లు ఐపీఎల్‌లో, ఓ సారి చాంపియన్స్ లీగ్‌లో ఫైనల్స్‌కు వెళ్లింది. ఆరు సార్లు జట్టు టైటిల్ గెలిచింది.



## ఆశికా రంగనాథ్ గ్లామర్ షో..

# వారణాసి'లో చిన్ననాటి మహేష్‌గా అభయ్ రామ్ ..

### రాజమౌళి సినిమాపై వైరల్ అవుతున్న కొత్త టాక్!




టాలీవుడ్ సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా, దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి తెరకెక్కిస్తున్న ప్రతిష్ఠాత్మక పాన్ వరల్డ్ చిత్రం 'వారణాసి'పై రోజురోజుకూ అంచనాలు పెరుగుతున్నాయి. టైమ్ ట్రావెల్ నేపథ్యంలో రూపొందుతున్న ఈ అడ్వెంచర్ డ్రామా ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటోంది. అయితే ఈ సినిమాకు సంబంధించి తరచూ ఏదో ఒక వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా, తాజాగా మరో ఆసక్తికర ప్రచారం సినీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. తాజా టాక్ ప్రకారం, జూనియర్ ఎన్టీఆర్ కుమారుడు అభయ్ రామ్ ఈ సినిమాలో కీలక పాత్రలో కనిపించనున్నారనే వార్త వైరల్ అవుతోంది. అంతేకాదు, సినిమాలో మహేష్ బాబు చిన్ననాటి పాత్రను అభయ్ రామ్ పోషించనున్నారనే ప్రచారం అభిమానుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.ఇండస్ట్రీ వర్గాల్లో వినిపిస్తున్న సమాచారం ప్రకారం, సినిమాలో చిన్న మహేష్ పాత్ర కథలో ఎంతో కీలకంగా ఉంటుందట. ఆ పాత్రకు కావాల్సిన లుక్, స్క్రీన్ ప్రెజెన్స్‌ను దృష్టిలో పెట్టుకుని రాజమౌళి ప్రత్యేకంగా అభయ్ రామ్‌ను ఎంపిక చేయాలని భావించారనే ప్రచారం జరుగుతోంది. రాజమౌళి, ఎన్టీఆర్ మధ్య ఉన్న సన్నిహిత అనుబంధం కారణంగా ఈ ప్రతిపాదనకు ఎన్టీఆర్ కూడా వెంటనే అంగీకరించారనే వార్తలు వినిపిస్తున్నాయి. అయితే ఈ విషయంపై చిత్రబృందం నుంచి ఇప్పటివరకు ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. రాజమౌళి తన సినిమాలకు సంబంధించిన వివరాలను పూర్తి గోప్యంగా ఉంచడం తెలిసిందే. ముఖ్యంగా 'వారణాసి' వంటి భారీ ప్రాజెక్ట్ విషయంలో ఒక్కో అప్డేట్‌ను కూడా సరైన సమయం వచ్చిన తర్వాతే వెల్లడించే అవకాశం ఉంది.చీవషం ఈ వార్త సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నందమూరి అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఎన్టీఆర్ నటనతో ప్రేక్షకులను అలరిస్తుండగా, ఇప్పుడు ఆయన కుమారుడు కూడా వెండితెరపై కనిపిస్తే చూడాలని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మరోవైపు, మహేష్ బాబు చిన్ననాటి పాత్రలో అభయ్ రామ్ కనిపిస్తే అది సినిమా హైలైట్‌గా నిలుస్తుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇక కొందరు అభిమానులు మరో ఆసక్తికర పోలికను కూడా తెరపైకి తీసుకొస్తున్నారు. గతంలో మహేష్ బాబు కుమారుడు గౌతమ్ కృష్ణ వెండితెరకు పరిచయమైన సందర్భాన్ని గుర్తు చేస్తూ, ఇప్పుడు అభయ్ రామ్‌ను రాజమౌళి పరిచయం చేస్తే అది నందమూరి అభిమానులకు ప్రత్యేక క్షణంగా నిలుస్తుందని సోషల్ మీడియాలో కామెంట్లు చేస్తున్నారు.

# ఆ సమస్యలతో బాధపడుతున్నా..

### అందుకే ఇలా కనిపిస్తున్నా.. ఓపెన్‌గా చెప్పేసిన జబర్దస్త్ యాంకర్

జబర్దస్త్ యాంకర్ రష్మీ గౌతమ్ క్రేజ్, పాపులారిటీ గురించి ప్రత్యేక పరిచయం అక్కర్లేదు. ప్రస్తుతం తెలుగు బుల్లితెర పై ఉన్న టాప్ మోస్ట్ యాంకర్లలో ఆమె కూడా ఒకరు. జబర్దస్త్ తో పాటు శ్రీదేవీ డ్రామా కంపెనీ, ఢీ వంటి టీవీ షోలకు యాంకర్ గా వ్యవహరిస్తోంది రష్మీ. ఇక అప్పుడప్పుడు సినిమాల్లోనూ మెరుస్తూ ఫ్యాన్స్ ను ఖుషి చేస్తోంది. కాగా ఇప్పుడు రష్మీ మరో రియాలిటీ షోకు హోస్ట్ గా వ్యవహరిస్తోంది. ఆహా ఓటీటీలో టాప్ తెలుగు ఇన్ ఫ్లూయెన్సర్ పేరుతో ట్యాలెంట్ హంట్ షో ప్రారంభమైన సంగతి తెలిసిందే. ఈ షోకు మంచు లక్ష్మీ, వైవా హర్షతో పాటు రష్మీ కూడా జ్యూరీగా వ్యవహరిస్తోంది. తాజాగా ఈ షో ప్రమోషన్స్ లో పాల్గొన్న రష్మీ తన పర్సనల్ అండ్ ప్రొఫెషనల్ లైఫ్ కు సంబంధించి పలు ఆసక్తికర వ్యాఖ్యలు చేసింది. ముఖ్యంగా తన శరీరాకృతిపై వచ్చిన కామెంట్స్ పై ఓపెన్ గా మాట్లాడింది. ఈ ఈవెంట్ లో భాగంగా యాంకర్.. 'మీరు ఈ మధ్యకాలంలో కాస్త బొద్దుగా, లావుగా కనిపిస్తున్నారు' అని అడగ్గా రష్మీ ఇలా ఆన్సర్ ఇచ్చింది. 'నిజం చెప్పాలంటే నాకు ఇలా కనిపించడం అస్సలు ఇష్టం ఉండడం లేదు. కెమెరా ముందు కనిపించే లుక్ వాస్తవానికి భిన్నంగా ఉంటుంది. కెమెరాల వల్ల కూడా కొంతమంది రియల్ కంటే ఇంకా లావుగా కనిపిస్తారు. అయితే నేను ఇలా కనిపించడానికి ప్రధాన కారణం నాకున్న కొన్ని ఆరోగ్య సమస్యలు. ఆ సమస్యల ప్రభావం వల్లే నా శరీరంలో మార్పులు వచ్చాయి. అందుకే ఇప్పుడు కాస్త బొద్దుగా కనిపిస్తున్నాను. అయితే ఈ పరిస్థితి కూడా శాశ్వతం కాదు. ప్రస్తుతం ఆరోగ్యంపై పూర్తిగా దృష్టి సారించాను. ఆరోగ్య సమస్యల నుంచి కోలుకున్న తర్వాత మళ్లీ ఫిట్‌గా, స్లిమ్‌గా కనిపించేందుకు ప్రయత్నిస్తాను. గత 20 ఏళ్లుగా ఈ సినిమా ఇండస్ట్రీలో ఎన్నో ఎత్తుపల్లాలు చూశాను. విజయాలు, అపజయాలు రెండింటిని ఫేస్ చేశారు. అయినప్పటికీ ప్రతి అనుభవం నాకు కొత్త పాఠం నేర్పింది. అందుకే జీవితంలో ఎలాంటి కఠిన పరిస్థితులు వచ్చినా ధైర్యంగా ఎదుర్కోవడం అలవాటు అయింది' అని చెప్పుకొచ్చింది రష్మీ. ప్రస్తుతం ఈ జబర్దస్త్ యాంకర్ కామెంట్స్ నెట్టింట వైరల్ గా మారాయి.



# కొరియన్ కనకరాజు' టీజర్ రిలీజ్..

### రాయలసీమ మాస్, కొరియన్ స్వాగ్‌తో అదరగొట్టిన వరుణ్ తేజ్




మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా, దర్శకుడు మేర్లపాక గాంధీ తెరకెక్కిస్తున్న వినూత్న హారర్ కామెడీ చిత్రం కొరియన్ కనకరాజుపై ప్రేక్షకుల్లో ఆసక్తి రోజురోజుకూ పెరుగుతోంది. ప్రముఖ నిర్మాణ సంస్థ యూవీ క్రియేషన్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఆగస్టు 7న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రానుంది. విడుదల తేదీ దగ్గరపడుతున్న నేపథ్యంలో చిత్రబృందం తాజాగా సినిమా టీజర్‌ను విడుదల చేసింది. వినోదం, హారర్, యాక్షన్, కామెడీ అంశాలతో నిండిన ఈ టీజర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ఈ టీజర్‌ను రెబల్ స్టార్ ప్రభాస్ విడుదల చేయడం విశేషం. విడుదలైన కొద్ది సేపటికే సోషల్ మీడియాలో వైరల్‌గా మారిన టీజర్ సినిమాపై భారీ అంచనాలను పెంచేసిందిటీజర్ ప్రారంభంలో వరుణ్ తేజ్ తన రాయలసీమ గ్రామాన్ని పరిచయం చేసే సన్నివేశాలు కనిపిస్తాయి. అయితే ఆ విజువల్స్‌తో పాటు బ్యాక్‌డ్రాప్‌లో కొరియాకు సంబంధించిన దృశ్యాలు కనిపించడం సినిమాపై ఆసక్తిని మరింత పెంచుతోంది. రాయలసీమ నేపథ్యంలో ప్రారంభమయ్యే కథ ఎలా కొరియాతో అనుసంధానమవుతుందనే అంశాన్ని దర్శకుడు ఆసక్తికరంగా దాచిపెట్టారు. ఈ చిత్రంలో కనకరాజు పాత్రలో వరుణ్ తేజ్ పక్కా రాయలసీమ యువకుడిగా కనిపిస్తారు. ఆయనకు స్నేహితుడిగా నటుడు సత్య తనదైన కామెడీ టైమింగ్‌తో ఆకట్టుకున్నాడు. ఇద్దరి మధ్య వచ్చే సంభాషణలు నవ్వులు పంచేలా ఉండనున్నట్లు టీజర్ స్పష్టం చేస్తోంది. అదే సమయంలో వరుణ్ తేజ్ మరో గెటప్‌లో కొరియన్ గ్యాంగ్‌స్టర్ లుక్‌లో కనిపించడం ప్రధాన ఆకర్షణగా నిలిచింది. స్టైలిష్ మేకోవర్, బాడీ లాంగ్వేజ్, స్వాగ్‌తో పూర్తిగా భిన్నమైన పాత్రలో కనిపించిన వరుణ్ ప్రేక్షకులను ఆశ్చర్యపరిచారు. టీజర్‌లో వరుణ్ తేజ్ పాత్రకు దెయ్యం పట్టిన తర్వాత జరిగే పరిణామాలను హాస్యభరితంగా చూపించారు. హారర్, కామెడీ కలయికలో వచ్చే సన్నివేశాలు సినిమాకు ప్రధాన హైలైట్‌గా నిలవనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా వరుణ్ తేజ్ రెండు విభిన్నమైన షేడ్స్‌లో చూపించిన నటన, కామెడీ టైమింగ్ సినిమాపై అంచనాలను మరింత పెంచుతున్నాయి. సంగీత దర్శకుడు ఎస్. థమన్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ టీజర్‌కు మరింత బలం చేకూర్చింది. హారర్ సన్నివేశాల్లో ఉత్కంఠను, కామెడీ సన్నివేశాల్లో వినోదాన్ని సమానంగా ఎలివేట్ చేస్తూ థమన్ తన మార్క్‌ను మరోసారి చూపించారు. ఈ చిత్రంలో రితికా నాయక్ హీరోయిన్‌గా నటిస్తుండగా, యూవీ క్రియేషన్స్ భారీ నిర్మాణ విలువలతో సినిమాను రూపొందిస్తోంది. క్రాస్-కల్చరల్ హారర్ కామెడీ కాన్సెప్ట్‌తో వస్తున్న ఈ చిత్రం తెలుగు ప్రేక్షకులకు సరికొత్త అనుభూతిని అందించనున్నట్లు టీజర్ ద్వారా అర్థమవుతుంది.

# ముఖ్యమంత్రి లక్ష్మీప్రణతిగా..



సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ యామినీ ఈఆర్ హీరోయిన్‌గా పరిచయం అవుతున్న చిత్రం 'క్వీన్'. సామాజికాంశాలతో ముడిపడ్డ ఈ లేడీ ఓరియెంటెడ్ డ్రామాకి రతన్ రిషి దర్శకుడు. వన్ సర్కిల్స్ పతాకంపై రూపొందుతున్న ఈ చిత్రంలో ముఖ్యమంత్రి లక్ష్మీప్రణతిగా సీనియర్ నటి రమ్యకృష్ణ కీలకపాత్ర పోషిస్తున్నారు. తాజాగా ఈ సినిమా షూట్‌లో ఆమె జాయిన్ అయ్యారు. ఈ సందర్భంగా మేకర్స్ ప్రకటన విడుదల చేశారు. నిజజీవిత పాత్రల స్ఫూర్తితో, వాస్తవ ఘటనల ఆధారంగా తెరకెక్కిస్తున్న ఫిక్షనల్ స్టోరీ ఇదని, సమాజంతో ముడిపడ్డ ఓ ఆసక్తికరమైన ప్రేమకథను ఇందులో చూస్తారని మేకర్స్ తెలిపారు. రెగ్యులర్ షూటింగ్ జరుపుకుంటున్న ఈ చిత్రంలో సాయికుమార్, తనికెళ్ల భరణి, అజయ్‌ఘోష్ ఇతర పాత్రధారులు. ఈ చిత్రానికి కెమెరా: బాల ఎన్. సరస్వతి, సంగీతం: భరత్ ఎం

Edited,Printed,Published & Owned by Mr.Nakka Raju, RNI No : TGTEL/26/A0738, Printed at NEWS 24HRS MEDIA SERVICES,Suryapet,- 508213 Telangana.
Published at 1-113 Prabhat Nagar,Chaitanyapuri,Rangareddy,Telangana - 500060.Telangana State. EDITOR : Mr.NAKKA RAJU, Cell 9160600610 | netibharath.daily@gmail.com